teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 185 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 2 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ‘5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

- నూతన సంవత్సర శుభాకాంక్షలు మర్యాదపూర్వక భేటీ
- గవర్నర్‌కు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసిన ముఖ్యమంత్రి





### పట్టాలెక్కనున్న వందే భారత్ స్లీపర్ ట్రైన్లు

- ప్రయాణికులకు రైల్వే శాఖ నూతన సంవత్సర కానుక
- ప్రధాని మోదీ చేతుల మీదుగా రైలు ప్రారంభం
- రాబోయే 2-3 రోజుల్లో షెడ్యూల్ విడుదల

4 లో




### దేశంలో కొత్త కార్మిక చట్టాల దిశగా అడుగులు

- నాలుగు కోడ్‌ల ముసాయిదా నిబంధనలు విడుదల
- పాత చట్టాల స్థానంలో కొత్త కోడ్‌ల అమలుకు కసరత్తు

4 లో




### పొగాకు ప్రియులకు కేంద్రం షాక్

- ఫిబ్రవరి 1 నుండి సిగరెట్లు, పాన్ మసాలాపై పెరగనున్న ధరలు
- ఆరోగ్య జాతీయ భద్రతా సెస్ విధిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్

4 లో

# నకిలీలకు చెక్

**తెలంగాణ సచివాలయంలో హైటెక్ ఐడీ కార్డుల పంపిణీ**




### గత ఘటనల నేపథ్యంలో కఠిన చర్యలు

**రెగ్యులర్ మరియు క్లాస్-4 ఉద్యోగులకు ప్రాధాన్యత**

తెలంగాణ సచివాలయంలో కొందరు నకిలీ ఐడీ కార్డులతో లోపలికి ప్రవేశించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు ఉద్యోగుల ఐడీ కార్డుల మార్ఫింగ్‌ను చెక్ చేస్తూ, నేటి నుంచి సచివాలయ ఉద్యోగులకు అత్యాధునిక టెక్నాలజీని జత చేస్తూ కొత్త ఐడీ కార్డుల పంపిణీని ప్రారంభించారు.




2




### డిజిటల్ చెల్లింపుల్లో భారత్ విశ్వరూపం

- 21.6 బిలియన్ల యూపీఐ లావాదేవీలతో రికార్డు
- నిత్యం సగటున 698 మిలియన్ల లావాదేవీలు
- రూ. 90,217 కోట్ల నిధుల బదిలీ
- గతేడాదితో పోలిస్తే 29 శాతం వృద్ధి నమోదు

న్యూ ఢిల్లీ, జనవరి 01 (తీన్మార్ న్యూస్): దేశంలో డిజిటల్ పేమెంట్స్ రోజురోజుకూ ఆదరణ పొందుతోంది. యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్) వాడకంలో భారత్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. తాజాగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన డేటా ప్రకారం డిసెంబర్ లో మన దేశంలో యూపీఐ ట్రాన్సాక్షన్లు భారీగా పెరిగాయి. ఒక్క నెలలోనే ఏకంగా 21.6 బిలియన్ లావాదేవీలు జరిగినట్లు

మిగతా 2 లో

### నీళ్లు.. నిజాలు అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశం

కృష్ణా గోదావరి నదీజలాల కేటాయింపులపై అవగాహన



.. వివరాలు 2లో



4

### 2028లో కేసీఆరే మళ్ళీ సీఎం

**అదే మా లక్ష్యం.. కేటీఆర్ భావోద్వేగ ప్రసంగం**

**క్యాలెండర్లు తప్ప ప్రజల బతుకులు మారడం లేదు**

**కాంగ్రెస్ పాలనపై కేటీర్ తీవ్ర విమర్శలు**

క్యాలెండర్లు మారుతున్నాయే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఓటేసిన ప్రజల జీవితాల్లో మాత్రం ఎలాంటి సానుకూల మార్పు రాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.



2

### హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేళ కిక్కు

**డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 2,731 మంది "మందుబాబులు అరెస్ట్"**

**మూడు కమిషనరేట్ల పరిధిలో రికార్డు స్థాయి కేసులు**

న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్ నగరంలో డ్రంకన్ డ్రైవింగ్ ఘటనలు రికార్డు స్థాయికి చేరాయి. కొత్త సంవత్సరం సంబరాల నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 2731 మంది మందుబాబులు పోలీసులకు చిక్కారు.

### రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

రహదారి భద్రత మాసోత్సవాలను ప్రారంభించిన మంత్రి పొన్నం



.. వివరాలు 2లో

### కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలతోనే ఏపీకి నీళ్లు

**ప్రాజెక్టుల అవినీతిపై సీఎం రేవంత్‌రెడ్డి నిప్పులు**

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరాల వెల్లడి**

**గోదావరి బేసిన్ అంశాలపై మంత్రి ఉత్తమ్, సీఎం సమీక్ష**



హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలతోనే ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నీళ్లు వెళ్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో కృష్ణా, గోదావరి బేసిన్ అంశాలపై మంత్రి

మిగతా 2 లో



### హైదరాబాద్‌లో మద్యం అమ్మకాల ఆల్‌టైమ్ రికార్డు

- ఎక్సైజ్ శాఖ చరిత్రలో ఒక్క నెలలోనే రూ. 5 వేల కోట్లు
- డిసెంబర్ 31 ఒక్కరోజే రూ. 350 కోట్లకు పైగా మద్యం సేల్స్
- కళకళలాడిన దుకాణాలు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం

2

### కుటుంబ పంచాయతీలే తెంపలేని కేసీఆర్

**ఊరికి శకునం చెబుతారా..?**

**ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు**

**హరీశ్ రావు మౌనం - వ్యూహాత్మకమేనా..?**

**కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నారంటూ జోస్యం**

హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): ఊరందరికి శకునం చెప్పే బల్లి పోయి కుడితిలో పడ్డట్టు కేసీఆర్ ప్రస్తుత పరిస్థితి ఉందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఎద్దేవా చేశారు. నిన్నటి వరకు ఊరందరి పంచాయతీలు తెంపిన కేసీఆర్ ఇప్పుడు కుటుంబంలో కొడుకు కూతురు, అల్లుడు బిడ్డ మధ్య పంచాయతీ తెంపలేకపోతున్నాడని విమర్శించారు. తాజాగా



మిగతా 2 లో

# నకిలీలకు చెక్




హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సచివాలయంలో కొందరు నకిలీ ఐడీ కార్డులతో లోపలికి ప్రవేశించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు ఉద్యోగుల ఐడీ కార్డుల మార్ఫింగ్‌ను చెక్ చేస్తూ, నేటి నుంచి సచివాలయ ఉద్యోగులకు అత్యాధునిక టెక్నాలజీని జత చేస్తూ కొత్త ఐడీ కార్డుల పంపిణీని ప్రారంభించారు. గత ఏడాది ఫిబ్రవరి నెలలో సచివాలయంలో ఫేక్ ఐడీ కార్డులతో ప్రైవేటు వ్యక్తులు ప్రవేశించడం, సెల్ఫీలు తీసుకోవడం వంటి సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. భద్రతా లోపాలు స్పష్టమవ్వడంతో పోలీసు శాఖ సిఫార్సుల మేరకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన కొత్త ఐడీ కార్డులు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, కొత్త ఐడీ కార్డుల్లో తెలంగాణ తల్లి విగ్రహం, సచివాలయం లోగో, ఉద్యోగి ఫోటో, ఎంప్లాయి ఐడీ నెంబర్, ಇ= కోడ్ (స్కాన్ చేసి తక్షణమే వివరాలు ధృవీకరించే వీలు కలిగేలా) మరియు ఇంటర్నల్ చిప్ (RFID టెక్నాలజీ)ను జత చేశారు. దీంతో ఐడీ కార్డు మార్ఫింగ్, నకిలీ తయారీ అవకాశం దాదాపు తుడిచిపెట్టబడింది. ప్రస్తుతం సచివాలయంలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులు సుమారు 1,300 మందికి, క్లాస్-4 ఉద్యోగులు 300 మందికి మొదటి దశలో ఈ కొత్త ఐడీ కార్డులు అందజేస్తున్నారు. త్వరలో మిగిలిన ఉద్యోగులకు కూడా పంపిణీ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తాజా పరిణామంతో సచివాలయంలో భద్రత మరింత బలోపేతమవుతుందని, ఉద్యోగుల పేరుతో సచివాలయంలోకి నకిలీ ఎంట్రీలు అడ్డుకట్టపడతాయని ప్రభుత్వ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ఇటీవలే ఉద్యోగులకు ఫేస్ రికగ్నిషన్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో భద్రతా చర్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## హైదరాబాద్‌లో మద్యం అమ్మకాల "ఆల్‌టైమ్ రికార్డు"



హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో డిసెంబర్ నెలలో మద్యం అమ్మకాలు చరిత్రాత్మక రికార్డును సృష్టించాయి. ఒక్క డిసెంబర్ నెలలోనే రూ.5102 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికా రులు వెల్లడించారు. ముఖ్యంగా న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31 రాత్రి ఒక్కరోజే రూ.350 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరగడం విశేషం. గత ఐదు రోజుల వ్యవధిలోనే రూ.1,344 కోట్ల మేర లిక్కర్ సేల్స్ నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఒకే నెలలో రూ.5,000 కోట్లకు మించి మద్యం విక్రయాలు జరగడం ఇదే తొలిసారి కావడంతో దీనిని ఆల్‌టైం రికార్డ్‌గా ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.

**సర్పంచ్ ఎన్నికలు, న్యూ ఇయర్ వేడుకలు**

సర్పంచ్ ఎన్నికలు, న్యూ ఇయర్ వేడుకలు ఒకేసారి రావడం వల్ల మద్యం వినియోగం భారీగా పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. పండుగ వాతావరణం, ఎన్నికల ప్రభావం కలిసి రావడంతో మద్యం దుకాణాల వద్ద కస్టమర్ల రద్దీ కొనసాగింది. దీంతో కొత్తగా ప్రారంభమైన మద్యం దుకాణాల యజమానులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లిక్కర్ సేల్స్ పెరుగుదలతో ఎక్సైజ్ శాఖకు గణనీయమైన ఆదాయం లభించిందని అధికారులు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలు, ఎన్నికల వాతావరణం కలిసి రావడంతో డిసెంబర్ నెల మద్యం అమ్మకాలు ఎక్సైజ్ చరిత్రలో నిలిచిపోయే స్థాయికి చేరాయని పేర్కొన్నారు.

# రోడ్డు భద్రత సామాజిక బాధ్యత





హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): ఖైరతాబాద్ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2026 01.01.26 - 31.01.26 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జేటీసీలు, డీటీసీలు, ఆర్టీఏ సభ్యులు నవీన్, సురేష్ లాల్ ఇతర ముఖ్య అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అధికారులకు స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర్ హెల్మెట్ లు బహుకరించారు. మాసోత్సవాల సంబంధించిన పోస్టర్, వాహనాల స్టిక్కర్స్, విద్యార్థుల అవగాహన బుక్స్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముందుగా అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం చేసుకున్నాం. జనవరి 1 నుంచి 31 జనవరి 2026 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుగుతున్నాయి. రోడ్డు భద్రత సంవత్సరం పాటు ఉన్నప్పటికీ నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడానికి ఈ కార్యక్రమం నడుస్తుంది అని అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో జాతీయ కార్యక్రమం నడుస్తుంది ఇందులో ప్రజల భాగస్వామ్యం కావాలి అని అన్నారు. డీజీపీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ల అత్యధిక మరణాలు రోడ్డు ప్రమాదాల వల్లే జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ తొలగిస్తూనే దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులను, అధికారులను భాగస్వామ్యం చేస్తూ నెల రోజుల పాటు ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేశాం. ప్రతి విద్యార్థి వాళ్ళ తల్లిదండ్రుల నుండి మేము రోడ్డు నిబంధనలు పాటిస్తాం అని హామీ పత్రం తీసుకోవాలి అన్నారు. అతి వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు, సీటు బెల్ట్ పెట్టుకోక పోవడం వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. అందరూ రోడ్డు నిబంధనలు పాటించాలి. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు అనాథలుగా మారుతున్నాయి. వారు శాశ్వత వికలాంగులు అయి రోడ్డున పడే పరిస్థితులు వస్తున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 10 వేలు చేసిన వందల కేసులు నమోదు అవుతున్నాయి. యూటర్న్ పక్కనే ఉందని రాంగ్ రూట్లో వెళ్తున్నారు. ప్రతి విద్యార్థి దగ్గరకు రవాణా శాఖ చేరుకోవాలి. అక్కడ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించాలి. మనం చేసే ప్రయత్నంలో ఒక్క ప్రాణం రక్షించబడ్డ మనకు సంతృప్తి ఉంటుంది. యావత్ రాష్ట్ర యంత్రాంగం ఇందులో భాగస్వామ్యం ఉంటుంది ఉదయం యాదగిరిగుట్ట లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ రిలీజ్ చేశాం. తల్లిదండ్రులు ఇంటి దగ్గర ఉన్న కుటుంబ సభ్యులను జ్ఞాపకం చేసుకొని వాహనాలు నడపాలి. రాష్ట్రంలో 1000 మంది రవాణా శాఖ అధికారులు ఉంటే కోటి 80 లక్షల వాహనాలు ఉన్నాయి. అందరూ వారికి వారుగా నిబంధనలు పాటించాలి. నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. లైసెన్స్ లు రద్దు చేస్తున్నాం. యూనిఫెస్ సూచనలతో పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ లు ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. రవాణా శాఖ అధికారులు ప్రతి ఒక్కరు మీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ లు ఏర్పాటు చేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు అన్నారు. ప్రజల భాగస్వామ్యం తో తెలంగాణ లో రోడ్డు ప్రమాదాలను తగ్గించే దిశలో పని చేద్దాం. ఇది సామాజిక బాధ్యత గా అందరూ నిబంధనలు పాటించాలి. ఎవరో చేసిన తప్పుకు ఇతరులు అమాయకులు ప్రమాదాల్లో బలి అవుతున్నారు. రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమంలో మీడియా విస్తృతంగా అవగాహన కల్పించాలి అని కోరారు.ం

# కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలతోనే ఏపీకి నీళ్లు

మొదటి పేజీ తరువాయి

ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణాలో 550 టీఎంసీల నీళ్లు ఇవ్వాలనే వాదనను అసలు కేసీఆర్ వినిపించలేదని ఆరోపించారు. నీటి వాటా కోసం అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో వాదనను వినిపించలేదని తెలిపారు. కేసీఆర్ నిర్ణయాలతో నేడు ఏపీకి ఎక్కువ నీళ్లు వెళ్తున్నాయని అన్నారు. జూరాల నుంచి శ్రీశైలానికి పాలమూరును మార్చడంతో నీళ్ల విషయంలో ఏపీకి కేసు వేసే అవకాశం వచ్చిందని అన్నారు. ఐదేళ్ల వరకు రూ.20 వేల కోట్ల బిల్లులు చెల్లించే వరకు కనీసం డీపీఆర్ కూడా తయారు చేయలేదని, ఎలాంటి అనుమతులు లేకుండానే పాలమూరు ప్రాజెక్టును చేపట్టారని గుర్తు చేశారు. అనంతరం ఆ దోపిడీ బయటకు రాకుండా ఉండేందుకు డీపీఆర్‌ను దాచారని పేర్కొన్నారు. రూ.32 వేల కోట్ల ప్రాజెక్టును రూ.80 వేల కోట్లకు పైగా పెంచారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టులకు నిధులు, అనుమతుల కోసమే ఢిల్లీకి వెళ్తున్నానని, బలమైన వాదనలు వినిపిస్తూ ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ కు రాజకీయ సమాధి తప్పదనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అబద్ధాల పోటీ పెడితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులు ఫస్ట్ వస్తారంటూ సెటైర్లు వేశారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు వచ్చి మాట్లాడాలని, ఆయన గౌరవానికి ఎలాంటి భంగం కలగదని తెలిపారు. రూ. వేల కోట్ల కమిషన్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తేలాలని అన్నారు. జూరాల నుంచి ప్రాజెక్టును మార్చడంతో లోతైన అవినీతి జరిగిందని అన్నారు. అదే జూరాల వద్ద



ప్రాజెక్టును కట్టి ఉంటే కావాల్సినన్ని నీళ్లు తీసుకునేవాళ్లమని పేర్కొన్నారు. మన భూభాగంలో మనం నీళ్లు తీసుకొని ఉంటే చంద్రబాబు, జగన్ ఢిల్లీలో మొత్తుకునే పరిస్థితి ఉండేదన్నారు. శ్రీశైలం నుంచి నీళ్లు తీసుకోవడాని కి మన శక్తి సరిపోదన్నారు. పాలమూరుపై వాస్తవాలు చెప్పేసరికి బనకచర్ల పేరుతో టాపిక్ డైవర్ట్ చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు-రంగారెడ్డిపై విచారణ చేపట్టి తప్పు ఎవరిదో తేలుస్తామనేసరికి బీఆర్ఎస్ డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. తిరిగి తమనే ఏపీకి తెలంగాణ నీళ్లు తాకట్టు పెట్టామంటూ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ ఏపీకి ఎవరైనా నీళ్లిస్తారా అని ప్రశ్నించారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ కంటే కేసీఆర్, హరీశ్ రావు తెలంగాణకు దుర్మార్గులని, ఉరేసినా తప్పులేదని అన్నారు. ఇదే తప్పు మిడిల్ ఈస్ట్ దేశాల్లో చేస్తే రాళ్లతో కొట్టి చంపేవాళ్లని పేర్కొన్నారు. ఉమ్మడి పాలకుల కంటే కేసీఆరే తెలంగాణ అన్యాయం చేశారని కామెంట్ చేశారు. కనీసం డాక్యుమెంట్లు కూడా కనిపించకుండా చేశారని ఫైర్ అయ్యారు. ఇరిగేషన్ శాఖలో ఆదిత్యనాథ్ దాస్ పూర్తి అనుభవం ఉన్న అధికారి అని, తెలంగాణలో అన్ని ప్రాజెక్టులపై దాస్‌కు అవగాహన ఉందన్నారు. అందుకే ఏపీ నుంచి ఆయనను తెలంగాణకు తీసుకొచ్చామని అన్నారు. ఆయనది ఏపీ, తెలంగాణ కాదని, బిహార్ రాష్ట్రానికి చెందిన వారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# డిజిటల్ చెల్లింపుల్లో భారత్ విశ్వరూపం

మొదటి పేజీ తరువాయి



గణాంకాలు చెబుతున్నాయి. వీటి విలువ రూ.27.97 లక్షల కోట్లుగా నమోదవ్వగా గతేడాదితో పోలిస్తే లావాదేవీలు 29 శాతం పెరిగింది.

**యూపీఐతోపాటు పెరిగిన ఐఎంపీఎస్ ట్రాన్సాక్షన్లు**

2025 నవంబర్ నెల కంటే డిసెంబరులో లావాదేవీలు పెరగడంతో డిజిటల్ చెల్లింపులకు ఎంత డిమాండ్ ఉందో స్పష్టంగా కనిపిస్తోంది. డిసెంబరులో రోజువారీ సగటు లావాదేవీల విలువ రూ.90,217 కోట్లుగా ఉండగా రోజుకు సగటున 698 మిలియన్ లావాదేవీలు జరిగాయి. యూపీఐ లావాదేవీలతో పాటు ఐఎంపీఎస్ ట్రాన్సాక్షన్లు కూడా పెరిగాయి. డిసెంబర్ నెలలో రూ.6.62 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి.

దేశంలో 709 యాక్టివ్ క్యూఆర్ కోడ్స్

ఇక దేశంలో క్యూఆర్ కోడ్స్ వినియోగం కూడా పెరిగింది. వరల్డ్ లైన్ ఇండియా రిపోర్ట్ ప్రకారం దేశంలో 709 మిలియన్ల యాక్టివ్ యూపీఐ క్యూఆర్ కోడ్స్ ఉన్నాయి. రూ.5 వస్తువు కొన్నా క్యూఆర్ కోడ్ పేమెంట్స్ చేస్తున్నారు. కిరాణాషాపులు, మందుల దుకాణాలు, రవాణా కేంద్రాలు, గ్రామీణ కేంద్రాల్లో స్కాన్ అండే పే ను వాడుతున్నారు. భారత్ డిజిటల్ పవర్ హౌస్ గా మారడంలో ఈ గణాంకాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి.

# నీళ్లు.. నిజాలు అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): ప్రజాభవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. 'నీళ్లు-నిజాలు' అంశంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కృష్ణ-గోదావరి నదీజలాల నీటి కేటాయింపులు, బీఆర్ఎస్ ఆరోపణలపై చర్చ జరిగింది. డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఎంపీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. 2014 నుంచి నేటి వరకు కృష్ణా- గోదావరి నదిలో నీటి కేటాయింపులు, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన ఒప్పందాలపై సీఎం అవగాహన కల్పించారు. రేపు అసెంబ్లీలో నీటి కేటాయింపులపై చర్చ నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు సమావేశంలో అవగాహన కల్పించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు, రెండేళ్ల ప్రభుత్వ పనితీరుపై నేతలు చర్చించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని బీఆర్ఎస్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్, హరీష్ చెప్తున్నది అబద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డికి కేసీఆర్ రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని పాలమూరు-రంగారెడ్డి పూర్తి కావాలంటే ఇంకా రూ.80 వేల కోట్లు కావాలన్నారు.

# హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేళ కిక్కు

హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్ నగరంలో డ్రంకన్ డ్రైవింగ్ ఘటనలు రికార్డు స్థాయికి చేరాయి. కొత్త సంవత్సరం సంబరాల నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 2731 మంది మందుబాబులు పోలీసులకు చిక్కారు.

**మద్యం మత్తులో నడిపిన వారిపై కేసులు**

నగర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ కొందరు హంగామా సృష్టించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలకు సహకరించకుండా కొందరు వాగ్వాదాలకు దిగగా, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రజల భద్రతకు భంగం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిన పోలీసులు, మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు.

**పోలీసుల వివరాల ప్రకారం**

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1198 మంది, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 928 మంది, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 605 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డారు. మొత్తం 2731 మందిపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా స్వయం క్రమశిక్షణ పాటించాలని పోలీసులు సూచించారు.

# కుటుంబ పంచాయతీలే తెంపలేని కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రఘునందన్ రావు త్వరలో బీఆర్ఎస్ ఫేడ్ అవుట్ కావడం ఖాయం అన్నారు. కవిత త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెట్టడం ఖాయం అన్నారు. అసెంబ్లీలో కేసీఆర్ వద్దకు సీఎం రేవంత్ రెడ్డి వచ్చినప్పుడు కేటీఆర్, కౌశిక్ రెడ్డి లేచి నిలబడకపోవడం వారి విజ్ఞతకే వదిలేయాలన్నారు. ముఖ్యమంత్రి కావాలని కేటీఆర్ ఆశపడుతున్నా ఆ మేరకు బీఆర్ఎస్ పార్టీ, ఆయన క్యాడర్, కుటుంబ సభ్యులు సహకరించడం లేదని అభిప్రాయపడ్డారు. హరీశ్ రావు ప్రస్తుతం మౌనంగా ఉండి జరుగుతున్న సంఘటనలు గమనిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఖచ్చితంగా అధికారంలోకి రాబోతోందని ఈ విషయంలో బాండ్ రాసి ఇవ్వగలనని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామన్న మోడీ, అమిత్ షా వ్యాఖ్యల్లో నూటికి నూరుశాతం జరుగుతుందన్నారు.

**బండి వర్సెస్ ఈటల ఇష్యూపై**

తెలంగాణ బీజేపీలో నేతల మధ్య వర్గపోరు పార్టీని డ్యామేజ్ చేస్తోందన్న అభిప్రాయంపై స్పందించిన రఘునందన్ రావు నాలుగు గోడల మధ్య నేతలు తమ తమ అభిప్రాయాలు చెబుతారని అయితే అంతిమంగా అధ్యక్షుడితే తుది నిర్ణయం అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఖరారు అయ్యాక ఎవరూ విభేదించలేదన్నారు. ప్రజాస్వామ్యంలో కూర్చొని మాట్లాడుకునే అవకాశం కూడా లేదన్నట్లు మా పార్టీలో విభేదాలు ఉన్నాయని మీడియా ప్రచారం చేస్తోందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బండి సంజయ్ వర్సెస్ ఈటల రాజేందర్ అంశంపై స్పందించారు. పార్టీ గుర్తులు లేకుండా జరిగిన ఎన్నికలను బట్టుకుని ఆయన క్యాండిడేట్ ఈయన క్యాండిడేట్ అని మాట్లాడటం ఏమిటన్నారు. ఒక ఎన్నికకు మరో ఎన్నికకు పొత్తు, పొంతన పెట్టకూడదన్నారు. ఇప్పటి వరకు ఉన్న తెలంగాణ వేరు ఇప్పుడున్న తెలంగాణ వేరు అని పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలన చూశాక ప్రజలు బీజేపీ వైపు ఆసక్తి చూపుతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

## జిల్లాలో రోడ్డు భద్రత మహోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 01 (తీన్మార్ న్యూస్): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన రోడ్డు భద్రత మహోత్సవాల వాల్ పోస్టర్, కరపత్రికలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం ఐడివైసి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతను సరదాగా తీసుకోవద్దని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అవుతున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, రహదారి సంకేతాల పాటన వంటి భద్రతా నియమాలను అనుసరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి మాసం మొత్తాన్ని జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోందని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సంధాని మహ్మద్, ఎస్సైజ్ ఈఎస్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఈ ఈ ప్రసాద్, ఉద్యాన అధికారి సునీల్, యువజన సర్వీసులు శాఖ అధికారి రఘు, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పని చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 01 (తీన్మార్ న్యూస్): జిల్లా అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అధికారి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని ఆయన స్పష్టం చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షల సందర్భంగా బొకేలు, పుష్పగుచ్చాలకన్నా విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష ప్యాడ్లు అందించాలన్న తన పిలుపుకు స్పందించిన వారందరినీ కలెక్టర్ అభినందించారు. ఈ ఆలోచన సామాజిక బాధ్యతను ప్రతిబింబించడమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడుతుందని తెలిపారు. సంకల్పం, సేవాభావం, సమన్వయం ఇవే మన జిల్లా పురోగతికి మూలస్తంభాలని పేర్కొంటూ, నూతన సంవత్సరం జిల్లా అభివృద్ధికి మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు.

## నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న సోదా రామకృష్ణ



పరకాల, జనవరి 01 (తీన్మార్ న్యూస్): పరకాల పట్టణంలోని పలు చర్చిలలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పాల్గొని నూతన సంవత్సర కేకులను కట్ చేయడం జరిగింది. ఈరోజు నూతన సంవత్సరం పురస్కరించుకొని పరకాల పట్టణంలోని పలు చర్చిలు మండుచున్న అగ్ని కృపావరం చర్చి, నజరేతు ప్రార్థన మందిరం లలో పాల్గొని నూతన సంవత్సర కేక్ కట్ చేసిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ అనంతరం వారు మాట్లాడుతూ దేవుని యొక్క కృప ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని, ఒకరికొకరు పట్ల దేవుని ప్రేమ కలిగి ఉండాలని. దేవుని రాకట కొరకు ప్రతి ఒక్కరు సిద్ధపడి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ పసుల రమేష్, నల్లెల్ల అనిల్ కుమార్, బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, నాయకులు దామ అనిల్ పాస్టర్ సిల్వన్ , పాస్టర్ మంద ఏలియా, ఆర్ఎస్ పాల్, బోయిని సదన్న, సంఘస్తులు కల కలకోల అశోక్, రేండ్ల సాంబయ్య, బొచ్చు రమేష్, ఒంటేరు గోపి, బొచ్చు అనంత్, సంపత్, రాజశేఖర్, రంజిత్, కళ్యాణ్, ముదురుకోళ్ల సుధాకర్, టి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టిగా రోడ్డు ప్రమాదాలను నియంత్రిద్దాం

**ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి**

**ట్రాఫిక్ రూల్స్ వాహనదారుల, ప్రజలు పాటించాలి**

**పెద్ద ఎత్తున అవగాహన ప్రజలకు కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, జనవరి 01 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో సమిష్టిగా అందరం కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పిలుపునిచ్చారు. ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ట్రాఫిక్ రూల్స్ పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో జాతీయ రోడ్డు మాసోత్సవం సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రచురించబడిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీ, పోస్టర్లు, కరపత్రాలను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి ఒకటి నుంచి 31 వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం జరుగుతుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రవాణా శాఖ అధికారులు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సామాజిక బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ అందరు పాటించేలా పెద్ద ఎత్తున అవేర్నెస్ తీసుకురావాలని పేర్కొన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలని తద్వారా వారి తల్లిదండ్రులకు వివరించేలా చూడాలని చెప్పారు. ఇందుకు ప్రైవేట్ స్కూల్స్ యజమాన్యాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యముగా, అతివేగము, డ్రంకన్ డ్రైవ్, మొబైల్ ఫోను మాట్లాడుతూ వాహనదారులు వాహనాలు నడపవద్దని సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో అధికారులు విద్యార్థులను విస్తృతంగా భాగస్వాములు చేయాలని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బ్లాక్ స్పాట్స్ వద్ద తగిన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు రవాణా శాఖ పోలీస్ శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకెళ్లాలని చెప్పారు. కండీషన్‌లో ఉన్న వాహనాలనే నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్ డి ఓ వెంకటేష్, ఆర్ టి ఓ శ్రీనివాస్, ఏ.ఎం. వి.ఐ. వినోద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీఆర్పీ ఆధ్వర్యంలో వీరన్న 64వ జయంతి వేడుకలు



భూపాలపల్లి, జనవరి 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆధ్వర్యంలో, భూపాలపల్లి టౌన్‌లో మహానుభావుడు మారోజు వీరన్న 64వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడినాయి. ఈ కార్యక్రమానికి టీఆర్పీ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ ముఖ్య అతిథిగా హాజరై జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రవి పటేల్ మాట్లాడుతూ 1962 జనవరి 1న సూర్యపేట జిల్లాలో జన్మించిన మారోజు వీరన్న తన గళం, ఆటపాటల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు మరియు బహుజనుల రాజ్యాధికార సాధన కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా లక్షలాది ప్రజలను చైతన్యం చేశారని కొనియాడారు. ప్రజా సమస్యలను ప్రజల భాషలో ప్రజల ముందుకు తీసుకెళ్లిన గొప్ప ప్రజాగాయకుడు మారోజు వీరన్న అని అన్నారు. మారోజు వీరన్న ఆశయాలను కొనసాగిస్తూ, నేటి కాలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతి కోసం రాజకీయంగా, సామాజికంగా, విద్యా-వైద్య రంగాల్లో నిరంతరం పోరాటం చేస్తున్న వ్యక్తి తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న అని రవి పటేల్ పేర్కొన్నారు. ఆయన మరో మారోజు వీరన్నలాగా బహుజనులను రాజ్యాధికార దిశగా నడిపిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో యువతకు ఆదర్శంగా నిలిచే ప్రజాపోరాట యోధులు, మహనీయుల జయంతులు, వర్ధంతులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా ఆధ్వర్యంలో నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. మహనీయులను స్మరించుకోవడమే కాకుండా వారి ఆశయాలను ఆచరణలో పెట్టడమే మన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ పార్టీ భూపాలపల్లి జిల్లా నాయకులు ప్రణయ్ రాజ్, జినుకల శ్రీను, ప్రణీత్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 01 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సరం-2026 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు నూతన సంవత్సరంలో ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించడమే పోలీస్ విధి అని పేర్కొంటూ, సీనియర్ అధికారులుగా ప్రజల అంచనాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. సమాజంలో మంచి, చెడు వ్యక్తులు ఉన్నప్పటికీ, నిర్దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టకుండా చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదురైనా, వాటిని సమర్థంగా అధిగమించడంలో సిబ్బంది అందరూ సమష్టిగా సహకరించారని ప్రశంసించారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా టీమ్‌వర్క్‌తో, ఒక కుటుంబంలా ఐక్యతతో, పూర్తి కమిట్‌మెంట్‌తో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్ గారు, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, వర్టికల్ డీఎస్పీ నారాయణ, సీఐలు, ఆర్ఐలు, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, డీపీఓ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగాం జిల్లా, జనవరి 01 (తీన్మార్ న్యూస్): జిల్లా ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం తెలియజేశారు. ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం అయిన సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు, వారి సిబ్బంది కలెక్టర్ ని కలిసి పేద విద్యార్థులకు అవసరమగు వస్తువులను కలెక్టర్ కి అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తోడ్పాటు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు,ప్రజల కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు.



# 2028లో కేసీఆరే మళ్ళీ సీఎం



హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): క్యాలెండర్లు మారుతున్నాయే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఓటేసిన ప్రజల జీవితాల్లో మాత్రం ఎలాంటి సానుకూల మార్పు రాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులు, కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టకముందు ఉన్న దుస్థితి మళ్లీ రాష్ట్రానికి తిరిగి వస్తోందని ఆరోపించారు. పండగ పూట కూడా రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కోసం చల్లటి చలిలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సిన దయనీయ పరిస్థితి కాంగ్రెస్ పాలనలో మళ్లీ వచ్చిందని దుయ్యబట్టారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భావోద్వేగభరితమైన ప్రసంగం చేసిన కేటీఆర్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్ 2028లో తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రిగా చూడటమే బీఆర్ఎస్ లక్ష్యమని, అదే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. చిన్నచిన్న ఎదురుదెబ్బలను పెద్దగా పట్టించుకోకుండా జాగ్రత్తగా ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**చరిత్రలో చెరగని ముద్ర:**

కేంద్రంతోనూ సమైక్యవాదులతోనూ 14 ఏళ్లు కేసీఆర్ నాయకత్వంలో సాగిన పోరాటాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 ఏళ్ల పాటు కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిందని, ఆ ప్రగతి సంతకాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని కేటీఆర్ కొనియాడారు. జెండాను చేతబట్టి నడిపించే నాయకులకంటే, ఆ జెండాను భూమిలో నిటారుగా పాతి ఇది నా జెండా అని గర్వంగా చెప్పే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని ఆయన పేర్కొన్నారు.

**గెలుపులు, ఓటములు శాశ్వతం కావు:**

పంచాయతీ ఎన్నికల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ప్రతి పోరాటం వరకు, లగచర్లలో గిరిజనులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన తీరుకు వ్యతిరేకంగా, రైతుబంధును రెండుసార్లు ఎగ్గొట్టిన అన్యాయంపై, ఆరు గ్యారంటీలు – 420 హామీలుపై ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన కార్యకర్తలను కేటీఆర్ అభినందించారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న దాష్టీకానికి వ్యతిరేకంగా గళమెత్తిన సోదరులను, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల ఆక్రమణకు నిరసనగా నిలిచిన విద్యార్థులను, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అన్యాయానికి ఎదురు నిలుస్తున్న తెలంగాణ తమ్ముళ్లను, ఆడబిడ్డలను ఆయన ప్రత్యేకంగా స్మరించారు. 2026వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న ఈ శుభసందర్భంలో ఒకటే విషయం గుర్తుంచుకోవాలని కేటీఆర్ పిలుపుని చ్చారు. గెలుపులు, ఓటములు శాశ్వతం కావని, అవి తాత్కాలికమని, అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు తగులుతా యని, కానీ తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం, గులాబీ జెండా స్థానం మాత్రం శాశ్వతమని స్పష్టం చేశారు.

**ఇతరులకు ఆట టీఆర్ఎస్‌కు ధర్మం:**

ఇతర పార్టీలకు తెలంగాణ రాజకీయాలు ఒక ఆటలా ఉంటే, తెలంగాణ సాధించిన బీఆర్ఎస్‌కు రాజకీయాలు ప్రజల సంక్షేమానికి సంబంధించిన ధర్మమని, ఒక విధి అని కేటీఆర్ తెలిపారు. గెలుపు–ఓటములతో సంబంధం లేకుండా పార్టీ ప్రయాణం నిరంతరం కొనసాగాలన్నారు. ఈ ఏడాది ఒక వైపు పోరాటాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు పటిష్టమైన సంస్థాగత నిర్మాణం కూడా అవసరమని కేటీఆర్ స్పష్టం చేశారు. పోరాటం, నిర్మాణం రెండింటినీ ఆధారంగా చేసుకుని ముందుకు సాగాలని, ధర్మం, న్యాయం, నిజాయితీ తమవైపే ఉన్నాయని, అందుకే విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్రం కలిసి రెండు పార్టీలు ఒకటై బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ, ప్రజల ఆశీర్వాదం, దైవ ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎవరూ ఏమీ చేయలేరని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగినా బీఆర్ఎస్‌ను అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు.

# పొగాకు ప్రియులకు కేంద్రం షాక్




న్యూ ఢిల్లీ, జనవరి 01 (తీన్మార్ న్యూస్): ఫిబ్రవరి 1 నుండి పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం మరియు పాన్ మసాలాపై కొత్త సెస్సు విధించనున్నట్లు ప్రభుత్వం నోటిఫై చేసింది. పొగాకు మరియు పాన్ మసాలాపై కొత్త సుంకాలు జీఎస్టీ రేటుకు మించి ఉంటాయి మరియు అటువంటి పాపం వస్తువులపై ప్రస్తుతం విధించబడుతున్న పరిహార సెస్‌ను భర్తీ చేస్తాయి. ఫిబ్రవరి 1 నుండి, పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు మరియు ఇలాంటి ఉత్పత్తులు 40 శాతం జీఎస్టీ రేటును ఆకర్షిస్తుండగా, బిరిస్ 18 శాతం వస్తువులు మరియు సేవల పన్ను ను ఆకర్షిస్తాయి. దీనితో పాటు, పాన్ మసాలాపై ఆరోగ్య మరియు జాతీయ భద్రతా సెస్ విధించబడుతుంది, పొగాకు మరియు సంబంధిత ఉత్పత్తులు అదనపు ఎక్సైజ్ సుంకాన్ని ఆకర్షిస్తాయి. డిసెంబర్‌లో పార్లమెంటు పాన్ మసాలా తయారీపై కొత్త ఆరోగ్య మరియు జాతీయ భద్రతా సెస్ మరియు పొగాకుపై ఎక్సైజ్ సుంకాన్ని విధించడానికి అనుమతించే రెండు బిల్లులను ఆమోదించింది.

# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్‌కు ఆయన సీఎం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేశారు. అనంతరం రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇద్దరూ కాసేపు చర్చించినట్లు తెలుస్తోంది.

**రాష్ట్ర ప్రజలందరికీ సీఎం విషెస్**

రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, విజయాలు, సంతోషాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. 2026 సంవత్సరం తెలంగాణ పురోగతిలో అద్భుతమైన మైలురాళ్లను అధిగమిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

రైతులు, యువత, మహిళలు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తుందని సీఎం తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా రూపొందించిన విజన్–2047 లక్ష్యాలను సాధించేందుకు మరింత వేగవంతమైన ప్రణాళికలతో ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల మద్దతు, సహకారంతో తెలంగాణను వేగవంతమైన అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

# దేశంలో కొత్త కార్మిక చట్టాల దిశగా అడుగులు

**నాలుగు కోడ్‌ల ముసాయిదా నిబంధనలు విడుదల**

**పాత చట్టాల స్థానంలో కొత్త కోడ్‌ల అమలుకు కసరత్తు**




న్యూ ఢిల్లీ, జనవరి 01 (తీన్మార్ న్యూస్): కేంద్రం నాలుగు కొత్త కార్మిక కోడ్‌ల కోసం ముసాయిదా నియమాలను నోటిఫై చేసింది. ఈ కార్మిక కోడ్‌లు – వేతనాల కోడ్, 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020, సామాజిక భద్రత కోడ్, 2020 మరియు వృత్తి భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్, 2020. ఈ నియమాలు కార్మికులు, వేతనాలు, ఉపాధి రకాలు, గ్రాట్యుటీ, బోనస్ మరియు గిగ్ వర్కర్లతో సహా కార్మికుల సామాజిక భద్రతను నిర్వచిస్తాయి. ఈ ముసాయిదా నియమాలు ప్రజల సంప్రదింపులకు తెరిచి ఉన్నాయి మరియు 45 రోజుల్లోపు అభ్యంతరాలు మరియు సూచనలను సమర్పించడానికి వాటాదారులను ఆహ్వానించారు. దేశంలో దశాబ్దాల నాటి కార్మిక చట్టాలను సరళీకృతం చేయడానికి మరియు క్రమబద్ధీకరించడానికి కార్మిక మంత్రిత్వ శాఖ గత ఏడాది నవంబర్ 21న ఈ నాలుగు కొత్త కార్మిక కోడ్‌లను అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. మంత్రిత్వ శాఖ ప్రకారం, కొత్త కార్మిక సంకేతాలు దేశ శ్రామిక శక్తికి మెరుగైన వేతనాలు, భద్రత, సామాజిక భద్రత మరియు సంక్షేమాన్ని నిర్ధారిస్తాయి. కార్మిక చట్టాలు అన్ని కార్మికులకు సకాలంలో కనీస వేతనాలు, యువతకు నియామక లేఖలు, మహిళలకు సమాన వేతనం మరియు గౌరవం, 40 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత మరియు ఒక సంవత్సరం ఉద్యోగం తర్వాత స్థిర-కాలిక ఉద్యోగులకు గ్రాట్యుటీని హామీ ఇస్తున్నాయి. ఈ సంస్కరణలు 40 ఏళ్లు పైబడిన కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య పరీక్షలు, ఓవర్ టైం పనికి రెట్టింపు వేతనాలు మరియు అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం కార్మికులకు సామాజిక న్యాయం యొక్క హామీని కూడా నిర్ధారిస్తాయి.

# పట్టాలెక్కనున్న వందే భారత్ స్లీపర్ ట్రైన్లు

**ప్రయాణికులకు రైల్వే శాఖ నూతన సంవత్సర కానుక**

**ప్రధాని మోదీ చేతుల మీదుగా రైలు ప్రారంభం**

**రాబోయే 2-3 రోజుల్లో షెడ్యూల్ విడుదల**



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): ఇండియన్ రైల్వేస్ ప్రయాణికులకు తీపికబురు చెప్పింది. ఈ మేరకు త్వరలోనే వందేభారత్ స్లీపర్ ట్రైన్ల కు అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లుగా రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ప్రకటించారు. అయితే, ఫస్ట్ ట్రైన్ కోల్‌కతా-గౌహతిల మధ్య నడవనుందని పీఎం మోడీ చేతుల మీదుగా ఆ ట్రైన్ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్-అస్సాం మధ్య నడిచే ఈ వందేభారత్‌లో ఫ్లైట్ టికెట్ ధరల కంటే తక్కువే ఉంటాయని తెలిపారు. రాబోయే 20 రోజుల్లో ఈ రైలు అందుబాటులోకి రానుందని జనవరి 18 నుంచి 19 తేదీల్లో వందేభారత్ స్లీపర్ ట్రైన్ ప్రారంభిస్తామని అన్నారు. రైలు ప్రారంభోత్సవం గురించి ప్రధాని మోదీకి తెలియజేశామని చెప్పారు. రాబోయే 2-3 రోజుల్లో ప్రారంభోత్సవ తేదీ వివరాలను ప్రకటిస్తానని తెలిపారు. ప్రస్తుతం కోల్‌కతా, గౌహతి నగరాల మధ్య విమాన ప్రయాణానికి రూ.6 వేలు నుంచి 8 వేలు ఖర్చవుతోందని అదే వందేభారత్ స్లీపర్‌లో 3 టైర్ ఏసీలో ఫుడ్‌తో కలిపి ఒక ప్రయాణికుడికి రూ.2,300, 2 టైర్ ఏసీ రూ.3 వేలు, 1 టైర్ ఏసీలో రూ.3,600 ఛార్జీలు ఉండొచ్చని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

# హాస్టల్ పిల్లలకు దుప్పట్లు, స్టేషనరీతో కలెక్టర్‌కు శుభాకాంక్షలు



ములుగు జిల్లా, జనవరి 01 (తీన్మార్ న్యూస్): గురువారం కలెక్టరేట్ లో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఐఏఎస్ కు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసారం హాస్టల్ విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు దుప్పట్లు మొదలగునవి మాత్రమే తీసుకురావాలని సూచించడంతో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నుండి హాస్టల్ పిల్లలకు దుప్పట్లు, వాటర్ బాటిల్స్, స్టేషనరీ పెద్ద ఎత్తున కలెక్టర్ కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం సంపత్ రావు మాట్లాడుతూ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పక్షాన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., మహేందర్ జి అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కందుల జీవన్ కుమార్, సంఘ నాయకులు ప్రకాశ్ రెడ్డి, కే కొమురయ్య, బి శ్రీనివాస్, కె శిరీష, ఎం రాజు, ఏ రాజ్ కుమార్, విజయ భాస్కర్, యశ్వంత్, రఫీక్, దుర్గారావు, సారంగపాణి రాజేశ్వరరావు, రహీం, రాజు, తదితరలు పాల్గొన్నారు.

# గరిమెళ్ళపాడు హెచ్ఎన్టీసి ను సందర్శించిన జిల్లా కలెక్టర్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 01 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఈ రోజు (గురువారం) గరిమెళ్ళపాడు హెచ్ఎన్టీసి నర్సరీని సందర్శించారు. సుమారు 72 ఎకరాల్లో విస్తరించి ఉన్న గరిమెళ్ళపాడు హెచ్ఎన్టీసి ను పూర్తిగా కలియతిరిగి పరిశీలించారు. గతంలో ఉన్న పాత భవనాలను ఒక్కొక్కటిగా నిశితంగా పరిశీలించారు. అలాగే ప్రస్తుతం నర్సరీలో ఉన్న మొక్కలు, గతంలో ఉన్న మొక్కలు, వివిధ విభాగాలు తదితర ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి, హార్టికల్చర్ సిబ్బంది రాజారామ్ నుండి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. తదనుగుణంగా గతంలో నర్సరీ ఏ విధంగా ఉండేదో, ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందో సమీక్షించి, మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి అవసరమైన చర్యలపై ప్రణాళికలు రూపొందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒకప్పటిలాగా మళ్లీ పూర్వ వైభవం తీర్చిదిద్దేలా చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులతో చర్చించి ప్రణాళికలు రూపొందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం చేపట్టాలి**

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 01 (తీన్మార్ న్యూస్): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ఐడీఓసి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కట్టుబాటుగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదనే అంశంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో రోడ్డు భద్రతా సందేశాలతో కూడిన బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ సమర్థవంతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా ఆర్టిఏ అధికారి జోషి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు మనోహర్, వెంకట పుల్లయ్య, తదితరులు, రవాణా శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భాగ్యనగరంలో ప్రశాంతంగా కొత్త ఏడాది వేడుకలు

## ట్రాఫిక్ నిబంధనలు, తనిఖీలతో సత్ఫలితాలు

## సీపీ సజ్జనార్ అభినందనలు



హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): నూతన సంవత్సర వేడుకలు హైదరాబాద్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. గురువారం ఎక్స్ వేదికగా ఆయన వెల్లడించారు. నూతన సంవత్సర సందర్భంగా నగర వ్యాప్తంగా చేపట్టిన కఠినమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్న అంశంపై నిర్వహించిన విస్తృత అవగాహన కార్యక్రమాలు, అలాగే ప్రజల సహకారం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా డ్రంక్ డ్రైవ్ నియంత్రణ చర్యల ఫలితంగా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోలేదని తెలిపారు. ఇది యాదృచ్ఛికంగా జరగలేదు. అవగాహన పనిచేసింది, బాధ్యత గెలిచింది, మీ సహకారమే తేడాను చూపించింది. హైదరాబాద్‌ను మరింత సురక్షితమైన, నిజమైన గ్లోబల్ నగరంగా తీర్చిదిద్దేందుకు మనమందరం కలిసి పని చేయాలి' అని సజ్జనార్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అలాగే, 'హైదరాబాద్ మరోసారి నిరూపించింది ప్రమాదం లేకుండా కూడా సంబరాలు జరుపుకోవచ్చు అని ఎప్పటికీ ఒకటి గుర్తుంచుకోండి. మద్యం, స్టీరింగ్ ఎప్పటికీ కలవకూడదు అని ప్రజలకు సూచించారు.

# భాగ్యనగరంలో నూతన సంవత్సర కోలాహలం

## ఆలయాలు, పర్యాటక ప్రాంతాలకు పోటెత్తిన జనం

## బిర్లా మందిర్, పెద్దమ్మ తల్లి ఆలయాల్లో భక్తుల కిటకిట

## ప్రార్థనలతో పులకించిన చర్చిలు



హైదరాబాద్, డిసెంబర్ 01 (తీన్మార్ న్యూస్): ఇయర్ 2026 సందర్భంగా దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు ప్రజలతో కిటకిటలాడాయి. కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని భక్తులు ఆయా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని బిర్లామందర్, జూబ్లీహిల్స్ టీటీడీ, పెద్దమ్మ తల్లి, బంజారాహిల్స్ లోని పూరీ జగన్నాథ, హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్స్ చిలుకూరు బాలాజీ, సూరారం కట్టమైసమ్మ ఆలయాలకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఇక ప్రధాన చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జనవరి 1 హాలిడే కావడంతో పర్యాటకులు సందర్శనీయ ప్రదేశాలకు పోటెత్తారు. జూపార్క్ కు మాదాపూర్ లోని శిల్పారామం వద్ద పర్యాటకులతో సందడి నెలకొంది.

# తిరుమల శ్రీవారి చెంత డిప్యూటీ సీఎం భట్టి

## తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థన

## కుటుంబంతో మొక్కులు చెల్లించుకున్న ఉప ముఖ్యమంత్రి



తెలంగాణ బ్యూరో, జనవరి 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయనకు టీటీడీ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వైకుంఠ ద్వారం ద్వారా శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం పలకగా, అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క, రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని, ఆర్థికంగా బలంగా అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రగతిపథంలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని ఆయన ఈ సందర్భంగా కోరుకున్నారు. అలాగే బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్, జమ్మూ, కాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హాలు శ్రీవారిని దర్శించుకున్న తర్వాత మీడియా ముందుకు వచ్చి, దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పెద్దమ్మ శ్యామలా దేవి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# బంగ్లాలో హిందువులపై ఆగని దాడులు

## మతోన్మాదుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ మరో వ్యక్తి



**ఢాకా, జనవరి 1:** బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణ కాండలు ఆగటం లేదు. కొంతమంది మతోన్మాదులు టార్గెట్ చేసి మరీ హిందువులపై దాడులు చేసి చంపేస్తున్నారు. నెలలో నలుగురు హిందువులపై దాడులు జరగటం అక్కడి హిందువులను తీవ్రంగా భయపెడుతోంది. డిసెంబర్ 16వ తేదీన ఓ బట్టల ఫ్యాక్టరీలో పని చేస్తున్న దీపు చంద్రదాస్ అనే యువకుడు మతోన్మాదుల దాడికి గురయ్యాడు. అతడితో పాటు పని చేస్తున్న వారే దారుణానికి ఒడిగట్టారు. కొట్టి చంపేసి, చెట్టుకు వేలాడదీసి కాల్చేశారు. దైవ దూషణకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఈ ఘోరం చేశారు. ఈ సంఘటన జరిగిన వారం రోజులకే రాజ్‌భరీలోని హోసయ్‌దంగ గ్రామానికి చెందిన 29 ఏళ్ల అమ్రిత్ మండల్ అలియాస్ సామ్రాట్ అనే యువకుడిని మతోన్మాదులు దారుణంగా కొట్టి చంపేశారు. దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ ఈ ఘోరానికి ఒడిగట్టారు. 29వ తేదీన సైల్‌హెట్ సదర్ కాదిర్‌పురకు చెందిన భజేంద్ర బిశ్వాస్ అనే 40 ఏళ్ల వ్యక్తి తనతో పాటు పని చేసే యువకుడి చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. ఆ యువకుడు భజేంద్రను తుపాకితో కాల్చి చంపేశాడు. పొరపాటున తుపాకీ పేలటంతో ఈ దారుణం జరిగిందని పోలీసులకు చెప్పాడు. మూడు సంఘటనల నుంచి తేరుకోక ముందే మరో సంఘటన జరిగింది. డిసెంబర్ 31వ తేదీన ఖోకన్ దాస్ అనే హిందూ వ్యక్తి మతోన్మాదుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. ఆస్పత్రి బెడ్‌పై ప్రాణాలతో పోరాడుతూ ఉన్నాడు. షరియాత్పూర్ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. నిన్న రాత్రి ఖోకన్ దాస్ ఇంటికి వెళుతూ ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే ఓ గ్యాంగ్ అతడిపై కత్తులతో దాడి చేసింది. విచక్షణా రహితంగా పొడిచేసింది. తర్వాత అతడిపై గ్యాంగ్ సభ్యులు కిరోసిన్ పోసి నిప్పంటించారు. అక్కడినుంచి పారిపోయారు. స్థానికులు అతడ్ని గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# అండర్ వరల్డ్ డాన్ ఇంట్లో సోదాలు

## మనీలాండరింగ్ కేసులో ఈడీ దాడులు

## భారీగా లెక్క చూపని బంగారం, వజ్రాలు, నగదు పట్టివేత



**న్యూఢిల్లీ, జనవరి 1:** మనీలాండరింగ్ కేసుకు సంబంధించి స్వర్వప్రియ విహార్ ప్రాంతంలో ఉన్న అండర్ వరల్డ్ డాన్ ఇందర్జీత్ సింగ్ యాదవ్, అతని అనుచరుల ఇండ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో కళ్లు చెదిరేలా డబ్బులు, బంగారు నగలు బయటపడ్డాయి. లెక్కల్లో చూపించని రూ.5 కోట్ల నగదు, రూ.8 కోట్ల విలువైన బంగారు, వజ్రాలు ఉన్న సూట్‌కేసు,35 కోట్ల రూపాయల విలువైన ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు అధికారులు. ఈ మొత్తం కలిపి సుమారు రూ.48 కోట్ల రూపాయల వరకు ఉంటుందని ఈడీ తెలిపింది. ప్రస్తుతం అమన్ కుమార్, ఇందర్జీత్ సింగ్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకుల అండతో ఇందర్జీత్ ప్రైవేట్ ఫైనాన్షియర్లు, బిల్డర్లు, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ డబ్బులు కూడబెట్టినట్లు సమాచారం. ఇందర్జీత్ సింగ్ జంఇ కేంద్రంగా కార్యాకలాపాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సోదాల సందర్భంగా డబ్బును లెక్కించడానికి బ్యాంక్ అధికారులు కౌంటింగ్ మిషన్ తెప్పించినట్లు తెలుస్తుంది. సందర్జీత్ యాదవ్, అతని అనుచరులపై హర్యానా, యూపీ రాష్ట్రాల్లో 15కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అక్రమ ఆయుధాలు కలిగి ఉన్నాడన్న కారణంగా ఆయుధాల చట్టంతో పాటు ఇతర కేసులు నమోదు చేసి, చార్జిషీట్లు కూడా దాఖలు చేశారు అధికారులు. ప్రస్తుతం ఈ డబ్బుల, నగలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# రాజస్థాన్‌లో ఉగ్రకుట్ర భగ్నం

## 150 కేజీల అమ్మోనియం నైట్రేట్ సీజ్

**జయపుర, జనవరి 1:** రాజస్థాన్‌లో ఉగ్రవాదులు భారీ ఉగ్రకుట్రకు పన్నాగం పన్నారు. పెద్ద స్థాయిలో బాంబు పేలుళ్లకు ప్లాన్ చేశారు. అయితే, పోలీసులు అప్రమత్తం అవ్వటంతో ఉగ్రకుట్ర భగ్నం అయింది. టోంకోలో ఓ మారుతీ కారులో తరలిస్తున్న 150 కేజీల అమ్మోనియం నైట్రేట్‌ను పోలీసులు సీజ్ చేశారు. నిందితులు ఎంతో తెలివిగా ఎవ్వరికీ అనుమానం రాకుండా ఉండేందుకు యూరియా బస్తాల్లో అమ్మోనియం నైట్రేట్‌ను తరలించడానికి ప్రయత్నించారు. అమ్మోనియం నైట్రేట్‌తో పాటు 200 దాకా ఎక్స్‌ప్లోజివ్ బ్యాటరీలు, 1100 మీటర్ల పొడువైన వైర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అనుమానితులను అరెస్ట్ చేశారు. వారిని సురేంద్ర, సురేంద్ర మోచీగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# తిరుమల లడ్డూకు భలే గిరాకీ

**తిరుమల, జనవరి 1:** గత ఏడాది తిరుమలలో లడ్డూ ప్రసాదాలను రికార్డు స్థాయిలో విక్రయించారు. 2024తో పోలిస్తే 2025లో 10 శాతం అదనంగా భక్తులకు విక్రయించినట్లు టీటీడీ తెలిపింది. 2024లో 12.15 కోట్ల లడ్డూలు అమ్మగా.. 2025లో ఆ సంఖ్య 13.52 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా డిసెంబర్ 27న 5.13 లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారని పేర్కొంది. ఏడాదిగా ప్రతిరోజూ 4 లక్షల వరకు లడ్డూలను తయారుచేస్తున్నట్లు టీటీడీ తెలిపింది. ముఖ్యమైన రోజుల్లో 8 లక్షల నుంచి 10 లక్షల లడ్డూలు భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించింది.

# ముంబైలో భారీగా బంగారం స్వాధీనం

## ఇద్దరు విదేశీ మహిళల వద్ద 32.79 కేజీల బంగారం పట్టివేత




**ముంబై, జనవరి 1:** నగరంలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి దాదాపు 32.79 కేజీల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ బంగారం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.19.15 కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు వివరించారు. ఆఫ్రికన్ దేశాల నుంచి ఈ ఇద్దరు మహిళలు వచ్చారని చెప్పారు. వీరిద్దరు వేర్వేరుగా విదేశాల నుంచి వచ్చారన్నారు. ఛత్రపతి శివాజీ విమానాశ్రయంలో దిగిన వీరు.. తీరు అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రయాణికులను అదుపులోకి తీసుకుని.. తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. సదరు మహిళల లోదుస్తులతోపాటు లగేజీలో భారీగా బంగారం దాచినట్లు గుర్తించామని కస్టమ్స్ అధికారులు వివరించారు. వీరిద్దరిని అరెస్ట్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి.. విచారిస్తున్నామని కస్టమ్స్ అధికారులు చెప్పారు.

# కొత్త ఏడాదిలోనూ ధరల పరుగు

## స్వల్పంగా పెరిగిన బంగారం..తగ్గిన వెండి



**హైదరాబాద, జనవరి 1:** కొత్త సంవత్సరం తొలి రోజునే బంగారం ధరల్లో పెరుగుదల కనిపించింది. గత మూడు రోజుల బేరిష్ ట్రెండ్‌కు బ్రేకులు చెబుతూ గురువారం పసిడి ధర స్వల్పంగా పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 11.00 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర నిన్నటితో పోలిస్తే స్వల్పంగా పెరిగి రూ.1,35,060కు చేరుకుంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర కూడా సుమారు రూ.150 మేర పెరిగి రూ.1,23,800కు చేరుకుంది. వెండి ధర మాత్రం మరింతగా తగ్గింది. కిలో వెండి రేటు నిన్నటితో పోలిస్తే సుమారు రూ.1000 మేర తగ్గి రూ.2,38,000కు చేరుకుంది. సుంకాల ప్రభావం, ఫెడ్ వడ్డీ రేటు కోతపై పెరుగుతున్న అంచనాలు, కేంద్ర బ్యాంకుల పసిడి కొనుగోళ్లు వంటివి బంగారానికి మళ్లీ డిమాండ్ పెంచుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే, నేడు ట్రేడింగ్ ఓ మోస్తరుగా ఉండటంతో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కూడా ఆ మేరకు పరిమితమయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అయితే రోజులు గడిచే కొద్దీ మళ్లీ వీటి ధరలు మళ్లీ పెరగడం పక్కా అని చెబుతున్నారు.

# భారత ఉద్యోగులకు అమెజాన్ ఊరట

## హెచ్-1బీ వీసాల ఆలస్యం..

## మార్చి వరకు వెసలుబాటు

**న్యూ ఢిల్లీ, జనవరి 1:** హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచి చూస్తూ భారత్‌లో ఉండిపోయిన తమ ఉద్యోగులకు అమెజాన్ ఊరట కలిగించే విషయం చెప్పింది. ఆరు రోజుల ఆఫీసు నిబంధనను సడలించి, మార్చి వరకు రిమోట్‌గా పనిచేసేందుకు వెసులుబాటు కలిగించింది. ఇందుకు కొన్ని షరతులు విధించినట్లు సమాచారం. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులకు అడ్వైజరీ పంపినట్టు తెలిసింది. హెచ్-1బీపై అమెరికాలో పనిచేస్తూ వివిధ కారణాలతో భారత్ వచ్చిన అమెజాన్ ఉద్యోగులు.. వీసా అపాయింట్‌మెంట్‌లో జాప్యం కారణంగా ఇక్కడే ఉండిపోయారు. ఇలా డిసెంబర్ 13 నాటికి భారత్‌కు వచ్చి, రీషెడ్యూల్ వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులకు ఈ ఏడాది మార్చి 2 వరకు ఇంటి నుంచే పని చేసుకునేందుకు అమెజాన్ అనుమతి ఇచ్చింది. ఈ సమయంలో కోడింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, సంబంధిత వ్యవహారాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం లేదా కస్టమర్లతో మాట్లాడటం వంటివి చేయకూడదని స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. వీటితోపాటు భారత్‌లో ఉన్న అమెజాన్ కార్యాలయాలకు వెళ్లకూడదని ఆదేశించింది. హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్‌లో జాప్యం కారణంగా అమెజాన్‌తో పాటు గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వీసా రీ-ఎంట్రీ ప్రక్రియకు నెలల సమయం పట్టే అవకాశం ఉందని, అందుకే అమెరికాను వీడి బయటకు వెళ్లొద్దని గూగుల్ ఇటీవల తన ఉద్యోగులకు సూచించిన విషయం తెలిసిందే.





# డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు చేసే కొబ్బరినూనె.. ఎందుకంటే..?

డయాబెటిస్ అనేది ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. దీని బారిన పడుతున్న వారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా యుక్త వయస్సులో ఉన్నవారు అధిక శాతం మంది టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అస్తవ్యవస్తమైన జీవన శైలి ఈ వ్యాధి వచ్చేందుకు ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఆహారం విషయంలో చాలా మంది తగు జాగ్రత్తలు పాటించడం లేదని, దీని వల్లే టైప్ 2 డయాబెటిస్ వస్తుందని అంటున్నారు. డయాబెటిస్ వచ్చిన వారు ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. లేదంటే వ్యాధి మరింత ముదిరే ప్రమాదం ఉంటుంది. ఆహారంలో పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకోవడం పూర్తిగా తగ్గించాలి. లేదా మానేస్తే మంచిది. ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకుంటే మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

**రోజూ ఇలా తీసుకోవాలి..**

డయాబెటిస్ ఉన్నవారు పిండి పదార్థాలు, చక్కెర అధికంగా ఉండే ఆహారాలను తినడం వల్ల శరీరంలో కొవ్వు నిల్వలు పేరుకుపోతాయి. దీంతో ఇన్సులిన్ నిరోధకత మరింత పెరుగుతుంది. దీని వల్ల షుగర్ మరింత ఎక్కువవుతుంది. కనుక ఆయా ఆహారాలను తీసుకోవడం పూర్తిగా తగ్గించాల్సి ఉంటుంది. ఫైబర్ ఉండే ఆహారాలను తినాలి. దీని వల్ల షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అయితే డయాబెటిస్ ఉన్నవారు కొబ్బరినూనెను ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కొబ్బరినూనె డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని అంటున్నారు. కొబ్బరినూనెను రోజూ వంట నూనెగా ఉపయోగించవచ్చు. లేదా రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ మోతాదులో తీసుకోవచ్చు. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

**ఇన్సులిన్ నిరోధకతకు..**

డయాబెటిస్ ఉన్నవారు రోజూ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచవచ్చు. దీంతో ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారికి సహజంగానే అజీర్తి సమస్య ఉంటుంది. ఆహారం జీర్ణమవడం ఆలస్యం అవుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకుంటే ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. అలాగే షుగర్ ఉంటే మలబద్ధకం కూడా ఇబ్బంది పెడుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల మలబద్ధకం అన్న మాటే ఉండదు. రోజూ ఉదయం సుఖంగా విరేచనం అవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది.

**ఇన్‌ఫెక్షన్లకు చెక్..**

కొబ్బరినూనెను సేవించడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. కొబ్బరినూనె యాంటీ మైక్రోబియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారికి తరచూ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. కనుక వారు కొబ్బరినూనెను తీసుకుంటే ఇన్‌ఫెక్షన్‌లకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా చర్మంపై, జననావయవాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల చర్మానికి ఎంతో మేలు చేస్తుంది.

# ఆస్తమా ఉందా.. అయితే ఈ చిట్కాలను పాటించండి.. ఉపశమనం లభిస్తుంది..!



చలికాలంలో లేదా ఇతర సమయాల్లో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చాలా మందికి శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సమస్యల బారిన పడుతుంటారు. అయితే ఇవి సహజంగా వచ్చేవే. కానీ ఆస్తమా ఉన్న వారికి మాత్రం సీజన్లు మారినప్పుడు లేదా చల్లని వాతావరణం ఉన్నప్పుడు తీవ్రంగా ఇబ్బంది కలుగుతుంది. ఆస్తమాతో అల్లాడిపోతారు. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు డాక్టర్ ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడాలి. అలాగే ఆహారం విషయంలోనూ అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల సమస్య నుంచి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. అలాగే శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. ఊపిరి సరిగ్గా పీల్చుకోగలుగుతారు.

**పసుపు..**

ఆస్తమా ఉన్నవారికి పసుపు ఎంతో మేలు చేస్తుంది. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆస్తమా నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. అందుకుగాను రోజూ రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కొద్దిగా పసుపును కలుపుకుని తాగాలి. ఇలా రోజూ చేయాలి. దీని వల్ల ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం పొందవచ్చు. అలాగే ఆహారం విషయానికి వస్తే ఫ్లేవనాయిడ్స్, విటమిన్లు సి, డి, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల కూడా ఆస్తమా ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ ఆహారాల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తీసుకుంటే శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల శ్వాస నాళాలు క్లియర్‌గా మారి ఊపిరి సరిగ్గా తీసుకోగలుగుతారు. ఇందుకు గాను నారింజ, నిమ్మ, కివీ, ఆలుగడ్డలు, పాలు, చేపలు, గుడ్లు, లివర్, జున్ను, తృణ ధాన్యాలు, సిట్రస్ పండ్లను తీసుకోవాల్సి ఉంటుంది.

**అల్లం..**

ఆస్తమా ఉన్నవారు టీ, కాఫీలను తరచూ తాగుతుండాలి. చక్కెర లేకుండా బ్లాక్ టీ లేదా బ్లాక్ కాఫీ తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. వీటిల్లో అధికంగా ఉండే కెఫీన్ ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. అలాగే శ్వాసనాళాలపై పడే ఒత్తిడి తగ్గిపోతుంది. దీంతో శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. అయితే కెఫీన్‌ను మరీ అధికంగా తీసుకోకూడదు. రోజుకు 3 లేదా కప్పుల టీ లేదా కాఫీ తాగాలి. అంతకు మించి తాగకూడదు. ఇక ఆస్తమాను తగ్గించుకునేందుకు అల్లం కూడా బాగానే పనిచేస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫాన్ని తొలగిస్తుంది. శ్వాస నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీని వల్ల శ్వాస సరిగ్గా లభిస్తుంది. ఆస్తమా నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం రసాన్ని రోజూ రెండు పూటలా పూటకు ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**యూకలిప్టస్ ఆయిల్..**

యూకలిప్టస్ ఆయిల్‌ను వాడుతున్నా కూడా ఆస్తమా లక్షణాలను తగ్గించుకోవచ్చు. ఇది దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో సహాయం చేస్తుంది. శ్వాసనాళాల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. కఫం కరిగిపోతుంది. ఒక ఖర్చీఫ్ మీద కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి దాన్ని నిద్రించేటప్పుడు ముక్కుకు దగ్గరగా పెట్టుకోవాలి. లేదా మరుగుతున్న నీటిలో కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి అనంతరం వచ్చే ఆవిరిని బాగా పీల్చాలి. ఇలా చేస్తున్నా కూడా ఉపశమనం లభిస్తుంది. శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. గాలి సరిగ్గా లభిస్తుంది. ఈ విధంగా పలు ఆహారాలను తీసుకుంటూ ఆయా చిట్కాలను పాటిస్తుంటే ఆస్తమా లక్షణాలను చాలా వరకు తగ్గించుకుని ఉపశమనం పొందవచ్చు.

# లావు ఉన్న వారికి నిమ్మ తొక్కలు ఓ వరం.. ఎలా అంటే?

మనమందరం నిమ్మకాయలను వివిధ సందర్భాల్లో ఆహారంలో వినియోగిస్తుంటాము. అయితే ఎక్కువ మంది నిమ్మ రసాన్ని వాడుకుని.. దాని తొక్కలను పడేస్తుంటారు. అలా తొక్కే కదా అని పడేస్తే.. మనం చాలా నష్టపోయినట్లే అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అధిక బరువు ఉన్న వాళ్లకు ఈ నిమ్మ తొక్కలు వరం లాంటివి. వాటిని సరిగ్గా వినియోగించుకుంటే.. బాడీ ఫ్యాట్ తగ్గి.. నాజూగ్గా మారవచ్చు. మరి.. నిమ్మ తొక్కలను ఎలా ఉపయోగిస్తే.. అధిక బరువు తగ్గొచ్చు ఇప్పుడు తెలుసుకుందాం..

నిమ్మ జ్యూస్ లో కంటే తొక్కలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయని చాలా మందికి తెలియదు. ఈ తొక్కలు ఒక న్యూట్రియెంట్ పవర్ హౌస్ లాంటవి అని నిపుణులు చెబుతున్నారు. ఈ తొక్కలో విటమిన్-సి, డీ-లిమొనెన్, ఫెక్టిన్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉన్నాయి. దీనిలోని విటమిన్ సీ శరీరంలోని రోగ నిరోధక శక్తిని బూస్ట్ చేస్తుంది. అలానే మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి కణాల డ్యామేజ్‌ను విటమిన్-సి ఆపుతుంది. అలానే దీనిలోని ఫైబర్, ఫెక్టిన్ అనేవి జీర్ణ వ్యవస్థకు హెల్ప్ చేస్తాయి. వీటి వల్ల త్వరగా ఆకలి వేయదు. ఫ్లేవనాయిడ్స్, డీ-లిమొనెన్ లు మెటబాలిజంను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. బోన్ హెల్త్‌కు కాల్షియం, మెగ్నీషియం బలం ఇస్తాయి.

నిమ్మ తొక్కలో ఉండే డీ-లిమొనెన్ శరీరంలోని కాంపౌండ్ కొవ్వును కరిగించడానికి మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. ఈ తొక్కను మన డైలీ లైఫ్ లో చేర్చుకోవడం చాలా ఈజీ. నిమ్మ తొక్కలను బాగా కడిగిన తర్వాత ఎండలో ఉంచి డ్రై చేయాలి. బాగా ఎండిన తర్వాత మిక్సీలో వేసి .. పౌడర్ లా చేయాలి. ఆ పౌడర్ ను రోజూ ఉదయం ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో కలుపుకొని తాగాలి. అలా రోజూ చేయడం వల్ల.. మనకు తెలియకుండానే బాడీ వెయిట్ తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గేందుకు వేలకు వేలు ఖర్చు చేయకుండా నిమ్మ తొక్కలతోనే మార్పు తెచ్చుకోవచ్చు.

# రోజూ ఉసిరి పొడిని ఇలా తినండి..

## ఎన్నో అద్భుతమైన లాభాలు కలుగుతాయి..!



చలికాలంలో ఉసిరికాయలు మనకు అధికంగా లభిస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. అందులో భాగంగానే చాలా మంది ఈ సీజన్‌లో లభించే ఉసిరికాయలను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఇవి అత్యంత పుల్లగా ఉంటాయి. కనుక వీటితో ఊరగాయలు, పచ్చళ్లు, పులిహోర వంటివి తయారు చేస్తుంటారు. అయితే వాస్తవానికి ఆయుర్వేదంలో ఉసిరికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉసిరిని రోజూ తీసుకోవడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. సాధారణ ఉసిరికాయలు మనకు కేవలం ఈ సీజన్‌లోనే లభిస్తాయి. కానీ ఉసిరిక పొడి మనకు మార్కెట్‌లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ఈ క్రమంలోనే రోజూ ఒక టీస్పూన్ ఉసిరిక పొడిని తింటుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. దీన్ని రాత్రి పూట ఒక టీస్పూన్ తేనెతో కలిపి తినవచ్చు. లేదా ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి తాగవచ్చు. ఇలా తీసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

ఉసిరిక పొడిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు తగ్గిపోతాయి. ముఖ్యంగా సీజనల్‌గా వచ్చే వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉసిరిక పొడిలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. అందువల్ల ఉసిరిక పొడిని తింటే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించుకోవచ్చు. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**కొలెస్ట్రాల్ స్థాయిలకు..**

ఉసిరిక పొడిని రోజూ తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ఉసిరిక పొడిని తింటుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి మేలు జరుగుతుంది. గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఉసిరిక పొడి శరీరానికి చలువ చేస్తుంది. కనుక దీన్ని తీసుకుంటే శరీరంలోని వేడి తగ్గిపోతుంది. గ్లూకోజ్ మెటబాలిజం మెరుగు పడుతుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఉసిరిక పొడిలో ఉండే క్రోమియం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ నియంత్రణలో ఉంటుంది.

**జీర్ణ వ్యవస్థకు..**

ఉసిరిక పొడిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ శక్తి పెరుగుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. శరీరంలో కొవ్వు చేరదు. మెటబాలిజం సైతం పెరుగుతుంది. దీని వల్ల కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. అలాగే చర్మానికి, శిరోజాలకు కూడా ఉసిరిక పొడి మేలు చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి కొల్లాజెన్ ను ఉత్పత్తి చేసేందుకు సహాయం చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. యవ్వనంగా ఉంటుంది. ముడతలు పడకుండా నిరోధించవచ్చు. చర్మం కాంతివంతంగా మారుతుంది. అలాగే జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా దృఢంగా పెరిగి ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం, శిరోజాలకు అప్లై చేసే వివిధ రకాల ప్యాక్‌లలోనూ ఉసిరిక పొడిని వాడవచ్చు. ఇలా ఉసిరిక పొడి మనకు ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



## టీ 20 వరల్డ్ కప్‌కు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

**కమిన్స్, హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్‌లకు చోటు**

**పేస్, స్పిన్ ఆల్‌రౌండర్లతో ఆసీస్ జట్టు**

**జనవరి 31 వరకు మార్పులకు అవకాశం**

భారత్ – శ్రీలంక వేదికగా జరగనున్న టీ 20 వరల్డ్ కప్ ఆస్ట్రేలియా తమ జట్టును ప్రకటించింది. ఉపఖండ పరిస్థితులను ద ృష్టిలో పెట్టుకుని, స్పిన్ బౌలింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తూ సెలెక్టర్లు జట్టును రూపొందించారు. నెమ్మదైన పిచ్‌లు, టర్న్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో రాణించేలా సమతూకంతో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన మిచెల్ స్టార్క్‌కు ప్రత్యామ్నాయాన్ని తీసుకోకపోవడం ఈసారి ఆస్ట్రేలియా వ్యూహంలో పెద్ద మార్పుగా భావిస్తున్నారు. మరోవైపు ఇటీవలే టీ20ల్లోకి అడుగుపెట్టిన కూపర్ కానొలీకి జట్టులో చోటు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఇది స్పిన్‌కు తగిన ఆల్‌రౌండ్ ఎంపికలపై ఆస్ట్రేలియా దృష్టి పెట్టిందని సూచిస్తోంది. గాయాల నుంచి కోలుకున్న ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్లకు సెలెక్టర్లు అవకాశం ఇచ్చారు. కమ్మిన్స్ ఈ నెలాఖరులో స్కాన్ చేయించు కోనుండగా, దాని ఫలితాల ఆధారంగా అతడి పూర్తి ఫిట్‌నెస్‌పై స్పష్టత రానుంది. హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ ఇద్దరూ హ్యామ్‌స్ట్రింగ్ గాయాల నుంచి రికవరీ అవుతున్నారు. జట్టు ఎంపిక వెనుక ఉన్న ఆలోచనను సెలక్షన్ కమిటీ చైర్మన్ జార్జ్ బెయిలీ వివరించారు. "ఇటీవల టీ20 ఫార్మాట్‌లో జట్టుకు మంచి విజయ పరంపర ఉంది. శ్రీలంక, భారత్‌లో ఉండే విభిన్న పరిస్థితులకు తగిన సమతూకంతో జట్టును ఎంపిక చేశాం. కమిన్స్, హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ ఫిట్‌నెస్ పరంగా మంచి దిశలో ఉన్నారు. వరల్డ్‌కప్‌కు వారు అందుబాటులో ఉంటారనే నమ్మకం మాకు ఉంది" అని బెయిలీ తెలిపారు. ఇది ప్రాథమిక స్క్వాడ్ మాత్రమేనని, అవసరమైతే జనవరి 31 వరకు మార్పులకు అవకాశం ఉందని కూడా స్పష్టం చేశారు. వరల్డ్ కప్‌కు ముందు పాకిస్తాన్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు జట్టును తర్వాత ప్రకటించను న్నట్లు తెలిపారు. ఆస్ట్రేలియా ఫిబ్రవరి 11న కొలంబోలో ఐర్లాండ్‌తో తొలి మ్యాచ్ ఆడుతుంది. ఫిబ్రవరి 13న జింబాబ్వేతో, ఫిబ్రవరి 16న కాండీలో శ్రీలంకతో, ఫిబ్రవరి 20న ఒమన్‌తో తలపడనుంది. గ్రూప్ దశ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే జరుగుతాయి. సూపర్ ఎయిట్‌కు అర్హత సాధిస్తే భారత్‌కు ప్రయాణించాల్సి ఉంటుంది.

**ఆస్ట్రేలియా టీ20 వరల్డ్ కప్ జట్టు**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కానొలీ, ప్యాట్ కమిన్స్, టిమ్ డేవిడ్, కామెరూన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, అడమ్ జాంపా.

## రిటైర్మెంట్ ప్రకటించే యోచనలో ఉస్మాన్ ఖవాజా

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులో తనదైన ముద్ర వేసిన సీనియర్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలగాలని యోచిస్తున్నారు. 2026 నాటికి ఆయన ఆట నుంచి విరామం తీసుకునే మొదటి ఆటగాడిగా నిలిచే అవకాశం ఉందని క్రీడా వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. వయసు రీత్యా, భవిష్యత్తు ప్రణాళికల ద ృష్ట్యా ఆయన ఈ నిర?యం తీసుకోబోతున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియా టెస్ట్ క్రికెట్‌లో అత్యంత నమ్మకమైన ఓపెనర్‌గా పేరు తెచ్చుకున్న ఉస్మాన్ ఖవాజా కెరీర్ ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం 37 ఏళ్ల వయసున్న ఖవాజా, రాబోయే ఏడాది లేదా రెండేళ్లలో తన అంతర్జాతీయ కెరీర్‌కు స్వస్తి పలకాలని భావిస్తున్నారు. ముఖ్యంగా 2026లో ఆయన రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని తాజా నివేదికలు సూచిస్తున్నాయి. ఖవాజా రిటైర్మెంట్ వెనుక ప్రధానంగా పెరుగుతున్న వయస్సు, ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నాయి. గత కొన్ని ఏళ్లుగా ఆయన ఆస్ట్రేలియా తరఫున టెస్టుల్లో అదుతేమైన ప్రదర్శన ఇస్తున్నప్పటికీ, యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఆయన తప్పుకోవాలని చూస్తున్నారు. 2025-26లో జరిగే ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ తర్వాత ఆయన ఆటకు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. పాకిస్థాన్‌లో జన్మించి, ఆస్ట్రేలియా జాతీయ జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగిన ఖవాజా ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. టెస్టుల్లో 5000కు పైగా పరుగులు చేసిన ఆయన, క్లిష్ట పరిస్థితుల్లో జట్టును ఆదుకోవడంలో సిద్ధహస్తుడు. డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్ తర్వాత ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌కు ఆయనే ప్రధాన బలంగా నిలిచారు. ఖవాజా ఒకవేళ 2026 ప్రారంభంలోనే రిటైర్ అయితే, ఆస్ట్రేలియా మేనేజ్‌మెంట్ కొత్త ఓపెనర్ కోసం అన్వేషణ ప్రారంభించాల్సి ఉంటుంది. ఇప్పటికే స్టీవ్ స్మిత్‌ను ఓపెనర్‌గా ప్రయోగించిన ఆసీస్, భవిష్యత్తు కోసం శామ్ కొంస్టాస్ వంటి యువ ఆటగాళ్లను సిద్ధం చేస్తోంది. ఖవాజా తన రిటైర్మెంట్‌పై అధికారికంగా ఇంకా ఎటువంటి ప్రకటన చేయనప్పటికీ, అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్, శారీరక శ్రమను ద ృష్టిలో ఉంచుకుని ఆయన 2026లో వీడ్కోలు పలకడం దాదాపు ఖాయమని తెలుస్తోంది.

# ఔచిత్యం కోసం పోరాడాల్సి వస్తుందో..!?

### 2027 వరల్డ్‌కప్ తర్వాత వన్డే ఫార్మాట్ మనుగడ కష్టమే

### టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్

ప్రపంచకప్ తర్వాత వన్డే ఫార్మాట్ మనుగడ, ఔచిత్యం కోసం పోరాడాల్సి వస్తుందని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టీమ్ఇండియా స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలు వన్డే ఫార్మాట్?కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఈ పరిస్థితి తలెత్తుతుందని అన్నాడు. ఓ హిందీ యూట్యూబ్ ఛానెల్?కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేశాడు."విరాట్, రోహిత్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడడం చాలా చర్చకు దారితీసింది. అయితే టీ20 లీగ్‌ల విస్తరణ, టెస్ట్ క్రికెట్‌కు ఇప్పటికే వాటికంటూ ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఓవర్ల ఫార్మాట్‌కు ఉన్న విలువ క్రమంగా తగ్గిపోతోంది. 2027 ప్రపంచకప్ తర్వాత వన్డేల భవిష్యత్తుపై నాకు నమ్మకం లేదు. వన్డే ఫార్మాట్ గురించి నేను కాస్త ఆందోళన చెందుతున్నాను. వాస్తవానికి నేను విజయ్ హజారే ట్రోఫీని ఫాలో అవుతున్నాను. కానీ నేను సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని ఫాలో అయినంతగా విజయ్ హజారే ట్రోఫీని అనుసరించడం కాస్త కష్టంగా ఉంది. అలాగే ప్రేక్షకులు ఏ ఫార్మాట్?లో క్రికెట్ ను చూడాలనుకుంటున్నారో మనం తెలుసుకోవాలి. టెస్ట్ క్రికెట్‌కు ఇంకా స్పేస్ ఉందని నేను భావిస్తున్నాను. కానీ వన్డే క్రికెట్‌కు మాత్రం స్థానం లేదని నేను గట్టిగా నమ్ముతున్నాను." అని అశ్విన్ తెలిపాడు. కోహ్లీ, రోహిత్ (ఇద్దరూ కలిపి 86 వన్డే సెంచరీలు) రిటైర్ అయిన తర్వాత వన్డే ఫార్మాట్ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశాడు అశ్విన్. కోహ్లీ, రోహిత్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నారని, దాంతో క్రీడాభిమానులు విజయ్ హజారే ట్రోఫీని చూడటం ప్రారంభించారని అన్నాడు. ఏదైనా క్రీడ ఎల్లప్పుడూ వ్యక్తుల కంటే గొప్పదని మనకు తెలుసని, కానీ కొన్నిసార్లు ఈ



ఆటగాళ్లు (రోహిత్-కోహ్లీ) ఆటను ఆసక్తిగా మార్చడానికి తిరిగి రావాల్సి ఉంటుందని వ్యాఖ్యానించాడు. "విజయ్ హజారే ట్రోఫీ వాస్తవానికి ఒక దేశీయ పోటీ. దీనిని ఎక్కువ మంది ఫాలో అవ్వరు (చూడరు). కానీ విరాట్, రోహిత్ ఆడుతున్నందున ఈ ట్రోఫీని చూస్తున్నారు. వారు వన్డే ఫార్మాట్?కు గుడ్ బై చెప్పేస్తే పరిస్థితి ఏంటి?. 50 ఓవర్ల క్రికెట్ ఒక అదుతేమైన ఫార్మాట్. ఇన్నింగ్స్‌ను ఎలా చక్కదిద్దాలో తెలిసిన మహేంద్ర సింగ్ ధోనీ వంటి ఆటగాడిని ఈ ఫార్మాట్ స ృష్టించింది. వన్డే ఫార్మాటే ఎంఎస్ ధోని లాంటి ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. ధోనీ చివరిలో చెలరేగిపోవడానికి ముందు 10-15 ఓవర్ల పాటు సింగిల్స్ తీసేవాడు. ఇప్పుడు ధోని లాంటి ఆటగాళ్లు లేరు. అలా ఆడాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే మీరు రెండు కొత్త బంతులతో ఆడుతున్నారు. సర్కిల్ లోపల ఐదుగురు ఫీల్డర్లతో ఆడుతున్నారు." అని అశ్విన్ గుర్తు చేసుకున్నాడు. అలాగే ఐసీసీ తన క్యాలెండర్?ను పునర్ పరిశీలించాలని అశ్విన్ కోరాడు. వన్డే ఫార్మాట్ నిరుపయోగంగా మారిందన్నాడు. ప్రతి ఏటా ఆదాయం కోసం ఒక ఐసీసీ టోర్నమెంట్ జరుగుతోందని అన్నాడు. కానీ ఫిఫా ఎలా చేస్తుందో చూడండని పేర్కొన్నాడు. "ఫుట్?బాల్ లీగ్‌లు (ఈపీఎల్, లా లిగా, సీరీ ఏ, బుండెస్లిగా) జరుగుతున్నాయి. వారు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి ప్రపంచకప్‌ను నిర్వహిస్తారు. ప్రపంచకప్ ఒక ప్రతిష్టాత్మక టోర్నమెంట్ కాబట్టి దానికి విలువ ఉంది. అయితే క్రికెట్?లో మరీ ఎక్కువ ద్వైపాక్షిక సిరీస్‌లు, ఎక్కువ ప్రపంచ కప్‌లు నిర్వహించడం కొంచెం అతిగా అనిపిస్తుంది. రాబోయే టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా వర్సెస్ యూఎస్ఏ, టీమ్ ఇండియా వర్సెస్ నమీబియా వంటి మ్యాచ్‌లు ఒక రకంగా క్రికెట్?కు ప్రేక్షకులను దూరం చేస్తాయి. నిజంగా వన్డే క్రికెట్‌కు ప్రాముఖ్యం తీసుకురావాలనుకుంటే టీ20 ఎక్కువగా ఆడి ప్రతి నాలుగేళ్లకు ఒకసారి వన్డే ప్రపంచకప్ పెట్టండి." అని అశ్విన్ తన అభిప్రాయాన్ని తెలిపాడు.

## విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో సత్తాచాటాలని చూస్తోన్న గిల్

టీమిండియా టెస్టు, వన్డే సారథి శుబ్‌మన్ గిల్ ఫాంలోకి వచ్చే టైం వచ్చేసిందా. సౌతాఫ్రికాతో ఇటీవల జరిగిన సిరీస్ లలో గిల్‌కు ఆశించిన స్థాయిలో ఆడలేదు. తమ మార్క్ బ్యాటింగ్ ఎక్కడా కూడా కనబడలేదు. అనంతరం గాయాల భారిన పడి రెండో టెస్టుతో పాటు వన్డే సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. ఆ తర్వాత కోలుకుని టీ20 సిరీస్‌కు వచ్చినా అతని బ్యాట్ నుంచి ఆశించిన స్కోర్ రాలేదు. దీంతో అతడ్ని పక్కనబెట్టారు. అయితే ఇప్పుడు మళ్లీ గిల్ ఫాంలోకి వచ్చే అవకాశం వచ్చింది. విజయ్ హజారే ట్రోఫీ తనకు వరంలా మారబోతుంది. విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో సత్తా చాటి తిరిగి ఫామ్‌లోకి రావాలని గిల్ భావిస్తున్నాడు. ఫాం కోల్పోయి అవకాశం కోసం ఎదురుచూస్తున్న స్టార్ ప్లేయర్లంతా విజయ్ హజారే ట్రోఫీలో రాణించి తిరిగి మైదానంలో అడుగుపెట్టాలని తహతహలాడుతున్నారు. ఇందులో భాగంగా రిషభ్ పంత్ ఢిల్లీ టీంకు సారథిగా ఉన్నాడు. ఇక నితీశ్ కుమార్ రెడ్డి ఆంధ్ర జట్టు కెప్టెన్‌గా ఉండగా.. రుతురాజ్ గైక్వాడ్ మహారాష్ట్ర, సరారేజ్ ఖాన్ ముంబై, దేవదత్ పడిక్కల్ కరా?టక తరఫున ఇప్పటికే తమ మార్క్ ప్రదర్శన ఇచ్చేస్తున్నారు. ఇక భారత బ్యాటింగ్ దిగ్గజాలు విరాట్ కోహ్లి ఢిల్లీ టీంకు, రోహిత్ శర్మ ముంబై తరఫున ఈ టోర్నీలో రెండేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నారు. అభిషేక్ శర్మ సైతం పంజాబ్ తరఫున బరిలోకి దిగాడు. మరోవైపు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నాడు. జనవరి 6,8వ తేదీల్లో గుజరాత్, సర్వీసెస్ జట్లతో జరిగే మ్యాచ్‌లలో సౌరాష్ట్రకు జడ్డూ ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఇక కరా?టక తరఫున వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. జనవరి 3, 6 తేదీల్లో త్రిపుర, రాజస్తాన్ జట్లతో ఆడబోతున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్ లో కోహ్లి, రోహిత్, గిల్, జడేజా, కేఎల్ రాహుల్ బరిలో దిగనున్నారు. స్వదేశంలో కివీస్‌తో టీమిండియా మూడు వన్డే, ఐదు టీ20లు ఆడనుంది. జనవరి 11న గుజరాత్ లోని వడోదరా స్టేడియంలో తొలి వన్డే జరగబోతుంది.



## డేవిడ్ మిల్లర్ సిక్సర్ల వర్షం

కొత్త ఏడాది వేళ దక్షిణాఫ్రికా స్టార్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ సిక్సర్ల వర్షంతో అభిమానులను హుషారెత్తించారు. SA20 లీగ్ నాలుగో సీజన్‌లో భాగంగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో పర్ల్ రాయల్స్ కెప్టెన్ డేవిడ్ మిల్లర్ అదుతే ఇన్నింగ్స్ ఆడి తన జట్టుకు ఈ సీజన్‌లో మొదటి విజయాన్ని అందించారు. సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌పై మిల్లర్ విధ్వంసం చూసి ఢిల్లీ క్యాపిటల్స్ (DC) యాజమాన్యం పండగ చేసుకుంటోంది. ఐపీఎల్ టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ జట్టు అయిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో డేవిడ్ మిల్లర్ విశ్వరూపం చూపాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ టీమ్ 150 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. లక్ష్య ఛేదనలో పర్ల్ రాయల్స్ టీమ్ కేవలం 35 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. మార్కో యాన్సెన్, అన్రిచ్ నోర్జే ధాటికి రాయల్స్ కుప్పకూలుతుందనుకున్న సమయంలో డేవిడ్ మిల్లర్ క్రీజులోకి వచ్చి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. డేవిడ్ మిల్లర్ కేవలం 38 బంతుల్లోనే 71 పరుగులు(నాటౌట్) చేసి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. మిల్లర్‌కు తోడుగా కీగన్ (45) నిలకడగా ఆడటంతో వీరిద్దరూ ఐదో వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్ చివరి ఓవర్ వరకు వెళ్లినా, మిల్లర్ మరో 2 బంతులు మిగిలి ఉండగానే సిక్సర్‌తో జట్టును గెలిపించారు. ఈ మెరుపు ఇన్నింగ్స్ చూసిన ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులు సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారు. ఐపీఎల్ 2026 వేలంలో ఢిల్లీ కేవలం రూ. 2 కోట్ల బేస్ ప్రైస్‌కే మిల్లర్‌ను దక్కించుకోవడం విశేషం. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఓడిపోయినా, ఆ జట్టు బౌలర్ మార్కో యాన్సెన్ ఒక అరుదైన రికార్డు స ృష్టించారు. SA20 చరిత్రలో 50 వికెట్లు తీసిన మొట్టమొదటి బౌలర్‌గా ఆయన నిలిచారు. అలాగే 19 ఏళ్ల కుర్రాడు నకోబాని మోకోనా 4 వికెట్లతో ఆకట్టుకున్నాడు.

## రషీద్ ఖాన్ కెప్టెన్సీలో వరల్డ్ కప్‌కు అఫ్గాన్ సిద్ధం

### రషీద్ ఖాన్ కెప్టెన్సీలో వరల్డ్ కప్

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026 కోసం అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు తమ సన్నాహకాలను ముమ్మరం చేసింది. స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ కెప్టెన్సీలో 15 మంది సభ్యులతో కూడిన జట్టును బోర్డు ఖరారు చేసింది. ఈ జట్టులో సీనియర్ ప్లేయర్లు అయిన గుల్బదిన్ నైబ్, ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ తిరిగి రావడం జట్టుకు పెద్ద బలాన్ని చేకూర్చింది. 2024 టీ20 ప్రపంచ కప్‌లో అఫ్గానిస్థాన్ సంచలన ప్రదర్శనతో సెమీఫైనల్‌కు చేరుకుని చరిత్ర స ృష్టించిన విషయం తెలిసిందే. ఆ మెగా టోర్నీలో ఆస్ట్రేలియా వంటి దిగ్గజ జట్లను ఓడించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. అదే ఊపును 2026 టీ20 ప్రపంచ కప్‌లోనూ కొనసాగించి.. ఈ సారి టైటిల్ సాధించడమే లక్ష్యంగా రషీద్ సేన బరిలోకి దిగుతోంది. ఇదిలా ఉండగా.. భుజం గాయం కారణంగా జట్టుకు కొంతకాలం దూరమైన ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ తిరిగి జట్టులోకి రావడంతో పేస్ విభాగం బలోపేతమైంది. మరోవైపు మిడిలార్డర్‌లో స్థిరత్వాన్ని ఇచ్చేందుకు సీనియర్ ఆల్‌రౌండర్ గుల్బదిన్‌ను ఎంపిక చేశారు. ముజీబ్ ఉర్ రెహ్మాన్ రాకతో స్పిన్ విభాగం మరింత పదునుదేరింది. అయితే యువ స్పిన్నర్ ఘుజన్‌ఫర్‌ను రిజర్వ్ ఆటగాడిగా ఎంపిక చేశారు. వికెట్ కీపర్ మహమ్మద్ ఇషాక్, యువ పేసర్ అబ్దుల్లా అహ్మద్‌జాయ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. అఫ్గానిస్థాన్ గ్రూప్-Dలో ఉంది. ఈ గ్రూప్‌లో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, యూఏఈ, కెనడా జట్లు ఉన్నాయి. ఫిబ్రవరి 8న చెన్నై వేదికగా న్యూజిలాండ్‌తో మొదటి మ్యాచ్‌లో తలపడనుంది. ప్రపంచ కప్‌నకు ముందు జనవరి 19 నుంచి 22 వరకు యూఏఈలో వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది.

**అఫ్గానిస్థాన్ జట్టు ఇదే:**

రషీద్ ఖాన్ (కెప్టెన్), రహమానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహమ్మద్ నబీ, గుల్బదిన్



నైబ్, నజీబుల్లా జద్రాన్, కరీం జనత్, నవీన్ ఉల్ హక్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫారూఖీ, నూర్ అహ్మద్, మహమ్మద్ ఇషాక్, షాహిదుల్లా కమల్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్.

రిజర్వ్ ఆటగాళ్లు: ఎ.ఎమ్.ఘుజన్‌ఫర్, ఇజాజ్ అహ్మద్‌జాయ్, జియా ఉర్ రెహ్మాన్ షరీఫీ.




# స్పిరిట్ నుంచి ప్రభాస్ లుక్ విడుదల

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' నూతన సంవత్సరం సందర్భంగా డార్లింగ్ అభిమానులకు దర్శకుడు సందీప్ అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. మూవీలోని ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు. ఇప్పటివరకూ తెరపై చూడని సరికొత్త అవతారంలో ప్రభాస్ కనిపించారు. ఒళ్లంతా గాయాలతో కమిలిపోయి ఉండగా, బ్యాండ్-ఎయిడ్‌లు కట్టుకుని ప్రభాస్ వెనక్కి తిరిగి నిలబడ్డారు. ఆయన ముందు త్రిప్తి దిమ్రి నిలబడి ఉంది. రా అండ్ రస్టిక్‌గా ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. చూడడానికి 'యానిమల్'లో రణ్‌బీర్ పాత్ర ఛాయలు కనిపిస్తున్నా, ప్రభాస్ కటౌట్ కావడంతో అంతకు మించిన హైఓల్టేజ్ యాక్షన్ చూపించబోతున్నట్లు అర్థమవుతోంది. 'ఇండియన్ సినిమా.. మీ ఆజానుబాహుడు/ఆజానుబాహు'ను చూడండి. హ్యాపీ న్యూఇయర్ 2026' అని సందీప్ వంగా పేర్కొన్నారు. 'మీరు ఇప్పటివరకూ ఉన్న దానిని ప్రేమించారు. ఇక నుంచి మీకు తెలియనిదానితో ప్రేమలో పడండి' అని టీమ్ పేర్కొంది. ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. సినిమా ప్రారంభం సందర్భంగా 'సౌండ్ స్టోరీ' పేరుతో ఓ ఆడియో టీజర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. ప్రభాస్ అకాడమీ టాపర్ అయిన ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్టు తెలుస్తోంది. పోలీసు అధికారి అయినా రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లాల్సి వస్తుంది. అక్కడ జైలర్‌గా ఉన్న ప్రకాశ్‌రాజ్‌కీ, ప్రభాస్‌కీ మధ్య సంభాషణ టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. ముఖ్యంగా ద్వితీయార్థంలో ఇందుకు సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులకు థ్రిల్ పంచుతాయని తెలుస్తోంది. ఇదే కథకు ప్రాణమని, మొత్తం సినిమాను మలుపు తిప్పే ఎపిసోడ్ అవుతుందని అంటున్నారు. దీనిపై స్పష్టత రావాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఇక ఇందులో త్రిప్తి దిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. టి - సిరీస్, భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్ సంస్థలపై ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్, క్రిషన్‌కుమార్ నిర్మిస్తున్నారు.

# సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో పవన్ కొత్త సినిమా


కొత్త ఆశలు.. అంచనాలతో సినీ తారలందరూ 2026కు స్వాగతం పలికారు. ఈ న్యూ ఇయర్‌కు పవన్ కళ్యాణ్ అభిమానులకు గుడ్‌న్యూస్ చెబుతూ గిఫ్ట్ ఇచ్చారు. ఆయన హీరోగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో ఒక సినిమా రానున్నట్లు నిర్మాత రామ్ తాళ్లూరి అధికారికంగా తెలిపారు. పవన్ కళ్యాణ్ పేరు పెట్టిన సంస్థ.. జైత్ర రామ్ మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమా రానున్నట్లు పోస్టు పెట్టారు. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. ఇక ఈ ఏడాది ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నిండాలని, నటీనటుల ఖాతాల్లో హిట్‌లు పడాలని కోరుకుంటూ మూవీ టీమ్స్ కొత్త సినిమా పోస్టర్లను షేర్ చేశాయి. అగ్ర, యువ కథానాయకులకు సంబంధించిన కొత్త సినిమాల అప్‌డేట్‌లు, లుక్స్‌తో సినీ ప్రియులు నెట్టింట పండగ చేసుకుంటున్నారు.



# కొత్త ఏడాది.. మరో బోల్డ్ స్టెప్.. భయపడేదేలేదు..

న్యూస్ రీడర్ గా కెరీర్ ను ఆరంభించి.. యాంకర్ గా జబర్దస్త్ లో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకుంది అనసూయ. ముఖ్యంగా బుల్లితెరకు గ్లామర్ ను పరిచయం చేస్తూ.. కామెడీ కార్యక్రమాలలో కూడా గ్లామర్ ఒలకబోసి తన అందాలతో మరింత పాపులారిటీ సంపాదించుకుంది. ముఖ్యంగా తన వాక్చాతుర్యంతో టిఆర్పి రేటింగ్ అమాంతం పెంచేసి.. దాదాపు 9 ఏళ్ల పాటు నిర్విరామంగా జబర్దస్త్ లో కొనసాగి అందరి మన్ననలు పొందింది. అలా జబర్దస్త్ లో యాంకర్ గా భారీ పాపులారిటీ అందుకున్న ఈమె సినిమాలలో నటిగా అవకాశం అందుకొని.. మరింత క్రేజ్ దక్కించుకుంది. రంగస్థలంలో రంగమ్మత్తగా.. పుష్ప సినిమాలో దాక్షాయినిగా తన పాత్రలతో మెస్మరైజ్ చేసింది. అంతేకాదు రజాకార్ లాంటి మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రాలలో కూడా నటించి నటిగా తానేంటో నిరూపించుకుంది అనసూయ. అటు సినిమాలతోనే కాదు ఇటు సమాజంలో జరిగే పలు అంశాలపై కూడా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా స్పందించే ఈమె.. ఇటు బోల్డ్ గా ఫోటోలు షేర్ చేసి అందరిని ఆశ్చర్యపరుస్తూ ఉంటుంది. అంతేకాదు ఎవరు ఏమనుకున్నా తన లైఫ్ తన ఇష్టం అంటూ స్వేచ్ఛ జీవితాన్ని గడుపుతూ అడ్డొచ్చిన వారికి లెఫ్ట్ అండ్ రైట్ ఇస్తూ తనదైన శైలిలో దూసుకుపోతోంది. ఇక అలాంటి ఈమె న్యూ ఇయర్ 2026 సందర్భంగా ఇంస్టాగ్రామ్ వేదికగా స్విమ్ సూట్ లో కొన్ని ఫోటోలు షేర్ చేసి మరోసారి రచ్చకు తెరలేపింది. అసలే గత కొన్ని రోజులుగా మహిళల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన కామెంట్లకు అనసూయ తనదైన శైలిలో స్పందించింది. అటు శివాజీ కూడా ఈమె వ్యాఖ్యలపై స్పందిస్తూ.. నేను మిమ్మల్ని ఇందులోకి లాగలేదు. కానీ మీరు అడ్డొచ్చారు.. తప్పకుండా మీరు రుణం తీర్చుకుంటాను అంటూ శివాజీ కామెంట్లు చేశారు.. అయితే ఎవరు ఎన్ని కామెంట్లు చేసినా తాను మాత్రం తగ్గేదేలే అని.. ఎవరికి భయపడను అంటూ మరొకసారి అందాలు ఆరబోస్తూ ఫోటోలు షేర్ చేసింది అనసూయ.



# ఫంకి బ్యూటీ డిమాండ్ బాగుంది..!

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ అనుదీప్ కెవి కాంబినేషన్ లో వస్తున్న ఫంకీ సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్. అంతకుముందు తెలుగులో శ్రీవిష్ణు తో అల్లూరి సినిమా చేసిన ఈ అమ్మడు ఆ టైంలో సరిగా రిజిస్టర్ అవ్వలేదు కానీ డ్రాగన్ సినిమాలో అమ్మడి యాక్టింగ్ గ్లామర్ చూసి తెలుగు యువత కూడా ఫిదా అయ్యారు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో కయదుకి విపరీతమైన ఫాలోయింగ్ పెరిగింది. ఐతే తెలుగులో మళ్లీ విశ్వక్ సినిమాతో తన లక్ టెస్ట్ చేసుకుంటుంది అమ్మడు. ఫంకీ సినిమాలో విశ్వక్ తో జత కడుతున్న కయదు లోహర్ ఈ సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ని తన టాలెంట్ తో మెప్పించాలని చూస్తుంది. ఐతే ఫంకీ సినిమా రిలీజ్ కాకముందే కయదు లోహర్ కి మరిన్ని ఆఫర్లు వస్తున్నాయని తెలుస్తుంది. ఇప్పటికే రెండు సినిమాలకు అమ్మడు సైన్ చేసిందట. త్వరలోనే ఆ సినిమాల అనౌన్స్ మెంట్ వస్తాయని తెలుస్తుంది. ఫంకీ లో నిర్మాత కూతురిగా తన తండ్రి డబ్బుని ఆదా చేయాలనే పాత్రలో నటిస్తుంది కయదు లోహర్. ఈ సినిమాలో ఆమె రోల్ మరోసారి తెలుగు ఆడియన్స్ ని ఫిదా అయ్యేలా చేస్తుందని అంటున్నారు. విశ్వక్ సేన్ సినిమా ఫంకీతో ఫిబ్రవరి వాలెంటైన్ వీక్ లో ప్రేక్షకుల ముందుకు వస్తుంది అమ్మడు. చాలా తక్కువ మందికి గ్లామర్ తో పాటు యాక్టింగ్ లో కూడా మార్కులు పడతాయి. డ్రాగన్ లో తన రోల్ తో అటు యాక్టింగ్ తో ఇంప్రెస్ చేస్తూనే తన గ్లామర్ తో ఆకట్టుకుంది కయదు. అందుకే అమ్మడికి తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు వస్తున్నాయి. ఎలాగు విశ్వక్ సినిమా తర్వాత తెలుగులో అమ్మడు బిజీ అవ్వడం గ్యారెంటీ అని తెలుస్తుంది. యువ హీరోలు కూడా కయదు తో జత కట్టేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఈమధ్య కాలంలో సోషల్ మీడియాలో ఎక్కువ డిస్కషన్ జరిగిన హీరోయిన్ గా కయదు లోహర్ కి మంచి క్రేజ్ ఏర్పడింది. తప్పకుండా అమ్మడికి తెలుగులో స్టార్ స్టేటస్ వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. విశ్వక్ సినిమాలో హీరోయిన్స్ కి బలమైన పాత్రలు పడతాయి. అనుదీప్ సినిమా కాబట్టి ఫంకీ సినిమాలో కయదు పాత్ర కచ్చితంగా ఆడియన్స్ కి ఇంప్రెస్ చేస్తుందని అనిపిస్తుంది. అల్లూరి తర్వాత డ్రాగన్ తో హిట్ కొట్టి మళ్లీ ఫంకీతో రీ ఎంట్రీ ఇస్తున్న కయదుకి ఈ సినిమా ఎలాంటి రిజల్ట్ ఇస్తుందో చూడాలి. సినిమాలే కాదు కయదు సోషల్ మీడియా ఫోటో షూట్స్ కూడా సూపర్ హైప్ తెచ్చుకుంటున్నాయి. డ్రాగన్ లాంటి హిట్ తెలుగులో కూడా పడితే మాత్రం కయదుని ఆపడం ఎవరి వల్లా కాదనేలా పరిస్థితి ఉంటుంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463